# ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది!

అరె! ఎంతాశ్చర్యంగా వుందో! కాలేజీలో బయల్దేరినప్పుడు బయట ఎండచూస్తే భయం వేసింది. అప్పుడే ఈ మబ్బులన్నీ ఎక్కణ్ణించి వొచ్చాయి? వానొచ్చేలా వుందే! .... అప్పుడే చినుకులు! బాగా కురిసేలాగే వుంది! ఆటో పోతోంది ఖాళీగా. ఏమౌతుందిలేవోయ్ తడిస్తే. పూలజల్లులా వుందే చక్కగా! .... చిన్నప్పుడు వానలో ఎంత తడిచే వాళ్ళమో! కొన్ని కొన్ని విషయాల్లో అమ్మ బలే మంచిది. మొన్న సత్యవతిగారు బుజ్జిగాణ్ణి నీళ్ళతొట్టి దగ్గిర ఆడి వొళ్ళంతా తడుపుకున్నాడని చావబాదింది. పాపం వాడికా దెబ్బలకే జ్వరం వొచ్చేసింది. 'లేదు, నీళ్ళలో తడిసినందుకే' అంటుందావిడ. దేవుడొచ్చి చెప్పాలిక! అమ్మ అయితే ఎప్పుడూ నీళ్ళల్లో ఆడుకో నిచ్చేది.

ఆహా, మట్టివాసనెంత కమ్మగా వొస్తోందో, ఏ సెంట్లు, ఏ అత్తర్లు, సరిపోతాయి దీనికీ? చిన్నప్పుడు ఎర్రటి మట్టి పెళ్ళలు పెట్టి పళ్ళు తోముకునేవాళ్ళం. ఇప్పుడైతే? చచ్చేభయం! దాన్నిండా క్రిములుంటా యట! గాలిలో కూడా ఏవో వుంటాయి! అంతా జాగర్త. జాగర్త. ఎందుకొచ్చిన జ్ఞానమో! బాగానే వుంది ఆలోచన. జ్ఞానంగా ఆలోచించడం తప్పా? అన్నిటికీ సత్యవతిగారి మూర్ఖత్వమే బాగుంటుందా ఏమిటి? ఎవరీయన మీదకొచ్చి ఆపుతున్నాడు కారు?

"మీ కభ్యంతరం లేకపోతే కారెక్కండి, దిగ బెడతాను ...." ఇంగ్లీషులో.

"థాంక్స్. వొద్దులెండి."

"ప్లీజ్! ఎక్కండి" కొంచెం పక్కకివొంగి వెనక తలుపుతీశాడు.

"అక్కర్లేదండీ! చాలా థాంక్స్! మీరు వెళ్ళండి!"

"వర్షం ఎక్కువయ్యేలా వుంది. బాగా తడుస్తారు."

కొంచెం విసుగ్గా — "వర్షంలో తడుస్తోన్న వాళ్ళు చాలామంది వున్నారండీ! అటు చూడండి. ఆ బిచ్చ గాడు .... ఎంత ముసలివాడో! ఆ వొంటి మీద పీలికలు తడిస్తే ఇంకో గుడ్డకూడా వుండదు. స్కూళ్ళనించి వొస్తోన్న ఆ పిల్లలంతా పుస్తకాలన్నీ తడుస్తూ .... పోనీ, వాళ్ళని ఎక్కించుకోండి!"

ఆ మాటలకి ముచ్చట పడ్డట్టు అతని నవ్వు — "అందరికీ ఎట్లా హెల్ప్ చెయ్యగలం? మీ నాన్నగారు నాకు బాగా తెలుసు."

"మా నాన్నగారి కీర్తిమీద మీ కారెక్కటం నాకిష్టం లేదులెండి."

సర్రున దూసుకుపోయింది కారు. దయా సము ద్రుడు మహా విసురుగా తోలుకుపోయాడు దాన్ని. కోపం వచ్చింది కావును 'ధిక్కారమున్ సైతునా?' అన్నట్టు పోతున్నాడు. ఎంత దయ, ఆడపిల్లలమీద!

అవునూ! రాజారావుగారి సంగతేం చెయ్యాలి! ఈ వాన సందట్లోపడి ఆ సంగతే గుర్తులేదు. చాలా ఆశ్చర్యం! అంత చొరవగా అడిగేస్తాడనుకోలేదు. ఏదో మామూలుగా మాట్లాడుతున్నాళ్ళే అనుకుంటే .... చాలాదూరం పోయింది వ్యవహారం! సుజాతకన్నా, కుసుమకన్నా, అందమైందా తను? పోనీ విశాల? ఎంత తెలివైందో! అదేమిటో అందర్నీ ఒదిలిపెట్టి తనమీద పట్టించాడు!

అబ్బో! వర్షం ఎక్కువౌతోంది. ఆకాశం చాలా గందరగోళ పడుతోంది. శతృవులు రమ్మంటున్నారు కావును యుద్ధానికి. డోళ్ళో, భేరీలో వాయిస్తారని చెప్పే వాడు కదూ గడ్డం తాత?" కత్తులు ధగధగలాడేట్టు విసురుకుంటూ ఆకాశంలో యుద్ధాలెందుకు తాతా? చక్కగా తాళాలు వాయిస్తూ పాటలు పాడుకోరాదూ?" అనేవాళ్ళు పిల్లలు. తాత నవ్వి, మాయచేసి, ఇంకేదో చెప్పేవాడు. సూర్యుడు పూలతోటకి నీళ్ళు పోస్తోంటే అవన్నీ కిందపడి వానొస్తుందట! "ఎప్పుడూ నీళ్ళే కింద పడతాయి. పువ్వులూ ఆకులూ కింద పడవేం?" అని అడ్డు ప్రశ్నలు వేసేవాడు రాముడు. ఇప్పుడెక్కడు న్నాడో! 'రామ్‌రావ్' అయ్యాడేమో! ఆ కథలెంత బాగుం డేవో! రాముడికి తప్ప ఎవ్వరికీ ఒక్క సందేహం వచ్చేది కాదు. ఆకాశంలో దేవతలు ఎగురుతున్నారంటే నమ్మటం! పాతాళంలో పిశాచాలు నిద్రపోతున్నా

యంటే నమ్మటం! అలా నమ్మితే ఎంత బాగుండేదో! ఇప్పుడెంత సైన్సు తెలిసినా అప్పుడొచ్చే ఆనందంలో వందోవంతు రాదేం? అందుకేనేమో మనుషులు మూఢనమ్మకాల్ని ఒదల్లేరు. ఇదేమిటీ వేదాంతం!

వర్షంలో తడవడం బాగానే వుంటుంది గానీ నడవటం ఇబ్బందే. అప్పుడే కుచ్చెళ్ళన్నీ తడిచి కాళ్ళకి అడ్డం పడుతున్నాయి. ఈపాడు చీరలూ పైటలూ ఒంటిచుట్టూ పూతరేకు మడతల్లాగ ఎవరుపెట్టారు ఇలా చుట్టుకోవాలని? సోషలిష్టు దేశాల్లో ఆడా మగా అందరూ ఒకేరకం డ్రెస్సు వేసుకుంటారట. పనికి అడ్డం రావు బట్టలు. మనంకూడా అలా మార్చుకో రాదూ? అమ్మో! చచ్చిపోతాం. మన చీరకట్టు సంస్కృతీ, అజంతా శిల్పసుందరి వొరవళ్ళూ, మన పట్టులూ బెనారస్‌లూ, ఏ గంగలో కలుస్తాయి? — ఆ పంజాబీ అమ్మాయి కొంతనయం. సుఖంగా నడుస్తోంది. ఆ దుపట్టాతో చాలా ప్రమాదం. దేనికో చుట్టుకు పోతుంది. దాన్ని అవతలపారేస్తే ఆ డ్రెస్ బాగానే వుంటుంది. మొన్న ఆ డ్రెస్ కుట్టించుకోబోతే అమ్మ కేకలేసింది, అమెరికా వాళ్ళు కూడా మన చీరల్నే మోజుపడుతున్నారు కాబట్టి మనం మన చీరలు వొదలకూడదంది. వాళ్ళు మన చీరల్ని ఇష్ట పడితే, మనం వాళ్ళ గౌనుల్ని ఇష్టపడాలా వొద్దా? మళ్ళీ అది పనికిరాదు. అందరూ మారాలి. మనం మార కూడదు. మన అమ్మమ్మలు చేసినపనే మనవరాళ్ళూ చెయ్యాలి. రెండు తరాలకి కాదుగదా పన్నెండు తరాలకికూడా మారని అచంచల స్థిరసంస్కృతి మనది! అయినా ఎవరికో నచ్చింది కాబట్టి ఇది చాలా గొప్ప అనుకోవటం ఎంత సిగ్గుచేటు! ఈ అమ్మల్తో ప్రతి చిన్న పనికీ యుద్ధాలు చెయ్యాలి. అనవసరం. శ్రమదానాలెందుకులే. చీరలే కట్టుకుంటే పోతుంది. స్వేచ్ఛావొచ్చే దాకా.

వర్షం జోరవుతోందోయ్! లాభంలేదు. చేతిలో ఈ పుస్తకాలొకటీ. లైబ్రరీవికూడా వున్నాయి. చెట్లమీదకి పక్షులూ చెట్లకిందకి మనుషులూ చేరుతున్నారు.

ఇల్లంటూ వున్నవాళ్ళు ఎలాగో పోయి తలుపులూ కిటికీలూ బిగించుకుని వెచ్చగా కూచుంటారు. మరి ఈ పేవ్‌మెంట్లమీదా చెట్లకిందా జీవించే బిచ్చగాళ్ళు .... జీవించటమా ఇది? జీవితం అనాలా దీన్ని? పక్షులకైనా లేని ఇంత దీనస్థితి ....

దేవు డెవరో అన్నాట్ట "పిట్టలకు చెట్లున్నాయీ, నక్కలకు తొర్రలున్నాయీ, ఏమీలేని మనుషులారా! నా దగ్గిరికి రండీ!" అని పిలిచాట్ట. పక్షులకీ జంతువు లకీ అక్కర్లేని దేవుడు, మనుషుల్ని ఉద్ధరిస్తాట్ట! "మాక్కూడా చక్కటి భవనాలున్నాయి. వానకీ ఎండకీ భయంలేని నివాసాలున్నాయి. నీ పనేదో నువ్వు చూసుకోవోయ్ దేవుడూ!" అని బిచ్చగాళ్ళంతా చెప్ప గలిగితే? .... అదంతా దూరపు కల అన్నారెవరో. అవును, ఇంకా ఎన్ని శతాబ్దాల దూరమో!

ఇక లాభం లేదు. బట్టలూ తలా సుబ్బరంగా తడిశాయి. ఈ భారత చీర చుట్టుకుని కాళ్ళు తడ బడేట్టున్నాయి. ఈ పుస్తకాల్ని రక్షించాలి కదా? వాహనం ఎక్కక తప్పదు. "ఏయ్! ఆటో ...."

★ ★ ★

సుధ ఆటో దిగి గేటు తీసుకుని తడిబట్టలతో నెమ్మదిగా నడుస్తూ ఇంట్లోకెళ్ళింది. తన గదిలో టేబుల్ మీద పుస్తకాలు ఆరపెట్టి, అలమారులోంచి బట్టలు తీసుకుని స్నానానికి పోతూ మళ్ళీ ఆలోచనల్లో మునిగింది.

మళ్ళీ ఏదో జరిగినట్టుంది. నాన్న తలెత్తి చూశాడే గానీ మాట్లాడకుండా, 'అయ్యో, అలా తడిశావే?' అనకుండా, పేపర్లో మునిగాడు. అసలీవేళప్పుడు నాన్న పేపరు చదవడు. పైగా ఈ వర్షంలో ఏ నవలన్నా చదువుకోక ఆ పిచ్చి రాజకీయాలు వీళ్ళకెలా నచ్చు తాయో! ఆ వియత్నాంలో అదేం యుద్ధమో .... దాని కెప్పటికన్నా అంతుందో లేదో! .... ఏవిటో రాస్తారు పేపర్లనిండా. సగం అబద్ధాలు .... అర్థం కావు. ఏమీ తెలీకుండా తనకే ఇంత కోపం వస్తోంది, అమెరికా మీద. ఎన్నో ధర్మపన్నాలు మాట్లాడే ప్రిన్స్‌పాల్ అస్తమానూ 'స్టేట్స్, స్టేట్స్' అని పాట పాడతాడేం?

ఆ బంగ్లాదేశ్ వార్తలంటే చాలా ఇష్టంగా వుండేది మొన్నటి దాకా. అక్కడ ఎంతోమంది ఆడవాళ్ళని ఇళ్ళల్లోంచి తరిమేశారట, చెడిపోయారని. మనుషులు కూడా చెడిపోతారా, పళ్ళో కూరగాయలో చెడిపోయి నట్టు? అన్నట్టు మనుషులంతా కాదు — ఒక్క ఆడ వాళ్ళే చెడిపోతారు! శత్రువొచ్చి మీదబడి పెడరెక్కలు

విరిచికట్టి బూటుకాలితో తన్ని తుపాకీలతో పొడిచినా ఏ మొగాడూ చెడిపోడు. పైగా వాడు వీరభక్తుడో దేశభక్తుడో అవుతాడు! సరిగ్గా అలాగే, అంత నిస్సహాయంగానే, ఆక్రోశిస్తూ శత్రువు చేతుల్లో పడ్డ ఆడవాళ్ళు మాత్రం చెడిపోతారు. తల్లులూ — తోబుట్టువులూ — భార్యలూ — కూతుళ్ళూ — ఇంక పనికి రాకుండా అయిపోతారు!

స్వతంత్రం తెచ్చుకున్నారట! ఎవరికోసం? ఏమీ తప్పుచెయ్యని ఆడవాళ్ళ మీద వీళ్ళంతా చేసిన దౌర్జన్యం మాటేమిటి? స్వతంత్రం అంటే మనం లాక్కునేదేనా? ఇచ్చేదికాదూ? పశువులెంత గొప్పవో!

అసలు శత్రువెప్పుడూ మన సిరిసంపదల మీదే కాదు, మన నీతి మీదా, పవిత్రత మీదా — మనం గొప్పగా ఆరాధించుకునే విలువలమీద దెబ్బ తీస్తాడట. మనల్ని అవమానించి, మన ఆత్మాభిమానాన్ని గాయపరిచి, మన జీవితాలు ఛిన్నాభిన్నం చెయ్యటమే వాడి లక్ష్యం అన్నమాట! అసలు మన విలువలు ఇంత అల్పమైనవి కాకపోతే? ఎవరెంత కక్ష సాధించినా, బలాత్కరించినా, మన పవిత్రత పోదనుకుంటే? శత్రు సైనికుడి క్రూరత్వంతో అవమానపడ్డ స్త్రీని, ఆమె భర్త ప్రేమతో అక్కున చేర్చుకుని కన్నీరు తుడిస్తే ....! అబ్బో! చాలా సంస్కారం కావాలి మనుషులికీ — దేశాలకీ.

తనని అమ్మ చూడలేదా? చూసినట్టే వుందే! "అలా తడిశావేమిటి?" అనాల్సిందే. సుబ్బులుకూడా మొహం ఎత్తకుండా పని చేసేస్తోంది. ఏం జరిగిందో మరి. ఏదో జరుగుతూనో వుంటుంది. పోట్లాటలు కల్పించుకోవటమే లక్ష్యం కొందరికి. ఏ చిన్న కారణమైనా దానికి ప్రోత్సాహం ఇస్తుంది. ఇక కష్టాలకేం కరువు?

అమ్మా నాన్నా అందర్లాంటి భార్యా భర్తలే అయితే, .... పెద్ద వాళ్ళెవరో చేసిన పెళ్ళయితే, .... ఇంతాలో చించక్కర్లేదు. 'ప్రేమ వివాహం' మరి! ప్రేమంటే మాటలా! సరిగ్గా అర్థంకాదుగానీ చాలా గొప్పదై వుండాలి. అంత గొప్పదా? ఏమో! నమ్మాలనిపించదు. అంత గొప్పదైతే, మరి?

రాజారావుగారు భలే ఆయన. ప్రేమా గీమా నస పెట్టకుండా తిన్నగా పెళ్ళిలోకి దిగాడు — "నీలాంటి అమ్మాయికోసమే .... నీలాంటి ...." అనేశాడు. అంత చనువుందనుకో.

"నాలాంటేగానీ, 'నేను' కాదుగదా మాష్టారూ!" అని నవ్వితే.

"ప్లీజ్ సుధా! ఈ విషయం సీరియస్‌గా ఆలోచించు తర్వాత మాట్లాడుకుందాం. ఎప్పుడు ...." అని ఆగాడు.

"కలుసుకుందాం?" అని కాబోలు ఆ చివర. ఎవరో వొచ్చి ఆయన్ని పిలుస్తోంటే బైటపడింది తను. కొన్నాళ్ళనించీ ఆయన ఈ ధోరణిలోనే వున్నట్టున్నాడు. అసల్లు తనెప్పుడూ అంత ఇష్టం చూపించలేదే! కొంచెం నవ్వి చనువుగా మాట్లాడితేనే ప్రేమ వొచ్చేసిందన్నమాట ఆయనకి! భలే ఆశ్చర్యంగా, ఏమీ తొణక్కుండా అడిగేశాడు. ప్రాక్టికల్ మనిషి. 'అందంగా' వుంటాడు. సందేహం లేదు. మంచివాడిలాగే కనిపిస్తున్నాడు. మరి అంతకోరి .... తనే ప్రేమించి .... ఛ! ఛ ప్రేమేమిటి! అబద్ధాల్లో అబద్ధం అది. ఎన్నాళ్ళు నిలుస్తుంది? — నిలుపుకోవటం చేతనైతే జీవితాంతం నిలుస్తుందేమో .... పిచ్చి .... నమ్మకూడదు. చేతకాకే నా, అమ్మా నాన్న ఇలా అయిపోతున్నారు? .... మరి అయితే ఆయనకి మాత్రం ఏం చేతనౌతుంది? మహా మహా వాళ్ళకే అసాధ్యం అది. రాజారావుగార్ని అడిగితే సరి "ఏవండీ, మీకు ప్రేమని నిలుపుకోవడం చేతనవుతుందా?" అని! పాపం తెల్ల మొహం వేస్తాడు.

ఎంత వాన కురిసినా చలెయ్యటంలేదే! వాన చప్పుడు ఎంత బాగుంటుందో! ఏం టిఫినో ఇవ్వాళ? అబ్బా.... ఆకలి.

సుధ పొడి టవల్‌తో మొహం తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్ళబోయింది. భోజనాల బల్లమీదే ప్లేట్లన్నీ మూతలు పెట్టివున్నాయి. కుర్చీలో కూచుని ప్లేటు దగ్గరికి తీసుకుంది. మూతతీసి చూస్తే — ఉప్మా!

చూడ్డానికి భలే అందంగా ఉంది, రాజారావుగారి లాగ — రుచి ఎలా ఉందోగానీ. నాన్న ఇంకా పేపరేనా? గొప్ప సంగతి!

"అమ్మా! చంద్రశేఖర్ రాలేదా? వొచ్చి వెళ్ళాడా?"

రెండు నిమిషాలైనా జవాబులేదు. అమ్మకి

బాగానే వినిపించింది మరి. అంటే అమ్మకి మాట్లాడాలని లేదన్నమాట. పోన్లే. అదే మంచిది. ఎవ్వరూ ఎప్పుడూ ఇష్టంలేని పనులు చెయ్యకూడదు. అతని ఇంటర్వ్యూ ఏమైందో! ఎంత ఆశతో వెళ్ళాడో! అంతంత చదువులు చదివి ఉద్యోగాలిమ్మని ముష్టి వాళ్ళలాగ యాచించటం! ప్రతి నిరుద్యోగీ ప్రతీ నిముషం ఎంత క్షోభ భరిస్తున్నారో! ముష్టితో జీవించే వాళ్ళు ఇంకెంత భరిస్తారో! చాలా కష్టాలు ఊహకి అందవు.

ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా .... సుబ్బులికిష్టమైన సిలోన్ తెలుగు పాటలుకూడా పెట్టకుండా .... అసలేమైంది ఇవ్వాళ? ఫస్టు తారీఖు కూడాను. ఇద్దరికీ జీతాలు వొస్తాయి. చాలా సరదాగా ఉండేరోజు. అంత గొప్పగా తమ ప్రేమతో జీవితాలు ఏకం చేసుకున్న వాళ్ళకీ కష్టాలేనా జీవితాల్లో?

ఆ వెంకట్రామయ్యగారూ పార్వతమ్మగారూ పోట్లాడుకున్నారంటే .... ఆయనకి చాలా ఆస్తి వుందని ఈవిడ పెద్దలూ, ఈవిడ బాగా కట్నం, నగలూ పట్టు చీరలూ తెస్తుందని ఆయన పెద్దలూ, పెళ్ళి చేశారు. మనిషికీ మనిషికీ జరిగిన పెళ్ళికాదు అది. వీళ్ళ డబ్బుకీ వాళ్ళ డబ్బుకీ అన్నమాట! ఆ డబ్బంతా తగలేస్తాడాయన. అందులో గొప్ప నేర్పరట. ఆ నేర్పు ఆవిడకేం నచ్చదు. తిడుతుంది. కొడతాడు. ఇంకా తిడుతుంది. ఇంకా కొడతాడు. సరే! అదంతా, నిత్యం సూర్యుడు తూర్పున ఉదయించినంత సత్యం! అంత సహజంగా జరిగిపోతుంది. గమ్మత్తేవిటంటే ఆవిడెప్పుడొచ్చినా ఓ కొత్త నగ పట్టుకొచ్చి "మా వారు నా కోసం కొన్నారు" అంటుంది. "మా వారు నాకివ్వాళ కడుపునిండా అన్నం పెట్టారు. ఓ గ్లాసు మంచినీళ్ళు కూడా ఇచ్చారు" అంటే ఎలా ఉంటుంది? ఆవిడ మాటలన్నీ అమ్మకి బాగానే ఉంటాయి, ఆశ్చర్యం! ఎప్పుడూ విసుక్కోదు.

రాధత్తయ్య? .... మేనత్త కొడుకేట వాళ్ళాయన. ఎంత చక్కగానో వుండొచ్చునా? ఎంత ఘోరంగా వుండటానికి వీలుందో రిసెర్చి చేస్తున్నారు. ఇంకెంత? కనిపెట్టేస్తారు. వాళ్ళ కృషీ, దీక్షా అలాంటివి. జోగారావుగారూ .... 'గారు' కూడా ఎందుకు, దండగ. "ఆయనవన్నీ వెధవ దరిద్ర బ్బుద్ధులండీ" అంటుంది వాళ్ళావిడ. ఆవిడెప్పుడూ పుట్టింట్లో వుంటుంది. ఈయనెప్పుడూ ఊళ్ళమీద తిరుగుతాడు — ఆ వెధవ దరిద్రబ్బుద్ధుల గూడార్థం ఏమిటో చాలా కాలం అర్థం కాలేదు. ఆయన గొప్ప 'రసికుడ'న్న మాట. రసికుణ్ణి, 'దరిద్రుడు' అనొచ్చునా? ఈసారి అడగాలి తెలుగు మాష్టార్ని!

అన్నపూర్ణగారు? అబ్బ! ఎంత మూర్ఖమో ఆవిడ! లేచింది మొదలూ — 'మా కులం .... మా శాఖ .... మా గోత్రం' అంటూ. కుల ప్రచారానికే ఈ లోకానికొచ్చినట్టు! కాళికాదేవి, తనమీదే ఆ భారం మోపి పంపినట్టు మాట్లాడుతుంది. పోనీ ఇతర్ల దగ్గిర పర్వాలేదు. ఆవిణ్ణి భరించలేకపోతే స్నేహం మానేస్తారు. జీవితాంతం కలిసి ఉండాల్సిన భర్త దగ్గిరకూడా — "మా వంశంలో ఇలాంటి వెన్నడూ ఎరగం! అసలు మా కుటుంబం .... మా తాతగారు .... మా పుట్టింటారు ....' అని ప్రారంభిస్తుంది. పోనీ, నవ్వి ఊరుకోరాదూ ఆయన? వినేవాళ్ళకి ఆసక్తి లేకపోతే ఆవిడ మాత్రం ఎన్నాళ్ళు వర్ణిస్తుంది? అసలు చాలా మందిని సినిమాలు చూసినట్టు చూసి ఆనందించాలి. ఆయనకి సినిమాలంటే ఇష్టమే. ఇది టిక్కట్టులేని సినిమా కదా? ఊరుకునేవాడేగానీ ఆవిడ వంశంకన్నా ఈయన వంశం మరీ గొప్పదైపోయాక ఏం ఊరుకుంటాడు? — "అదేంకాదు. మా వాళ్ళే మీ వాళ్ళకన్నా ...." అని చిన్న అభ్యంతరం లేవదీస్తాడు.

"మీరలా అంటే నేనూరుకోను. అసలు మా తాతగారు...." అని ఈవిడా!

"ఏడిశాళ్ళే మీ తాత 'గారు' "

"మీ తాతే ఏడుస్తాళ్ళెండి."

"నోరుముయ్యి. పళ్ళు రాలగొడతాను."

చివరికి — ఆయన తాతే గొప్పవాడవుతూ వుంటాడు! ఆయన బండ తిట్లతో ఆవిడ నిజంగానే నోరుమూసి భోరున ఏడుస్తుంది. ఒక్కటి మాత్రం నిజం. పెళ్ళాన్ని — వెకిలిగా తిట్టే వంశం ఆయన్ది! ఆ కమ్మటి తిట్లన్నీ చక్కగా అరాయించుకునే వంశం ఈవిడిది! 'ఈడూ జోడూ సరిపోవాలి' అంటారే, అది అక్కర్లేదు గానీ, 'వంశం — వంశం సరిపోవాలి'. తను అన్ని తిట్లు తింటోంటే తన గొప్ప వంశీకులెవరూ ఎందుకు రారో .... తన నెందుకు రక్షించరో, ఆవిడకి

పట్టదు. మళ్ళీ రెండు రోజులు పోయాక — "మీకు తెలీదుగానీ .... మా తాతగారు .... అబ్బో! ఆయన ఠీవీ........"

ఈ రెండు రోజుల్లోనే ఆ ముసలాయనకి అంత ఠీవి ఎలా మొలిచిందో అర్థంగాక ఈయన మళ్ళీ .... "ఏడిశావ్లే ...."

భూమి తన చుట్టూ తను తిరుగుతుంది కదా? వాళ్ళిద్దరూ వాళ్ళతో వాళ్ళే పోట్లాడుకుంటారు. మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ!

ఈ మనుషు లెవరిమధ్యా 'ప్రేమ బంధం' లేదు. అసలు ఇవన్నీ వొట్టి వివాహ బంధాలు. కట్నాల చదువుల్లాగా, పెళ్ళి సంగీతాల్లాగా, సాంప్రదాయాల వుచ్చులు. అవి నానా చిక్కులూపడి — కాళ్ళకీ, చేతు లికీ, కంఠాలకీ బిగుసుకుంటాయి. విప్పుకోడం చేత కాక, పెనుగులాడి, మరీ చిక్కులు చేసుకుని ముళ్ళు పడేసుకుంటారు.

కానీ, అమ్మా నాన్నా అలాక్కాదే!

"అదేమిటి? జీడిపప్పంతా ఏరిపెడుతున్నావు?"

ఉలిక్కిపడి తలెత్తింది సుధ. జీడిపప్పంతా ఇంకో ప్లేట్లోకి చేరింది. అదంతా మళ్ళీ ఉప్మాలో పడేసుకుంది.

అమ్మ మొహం చాలా విచారంగా .... నాన్నింకా రాలేదు టిఫిన్కి. అమ్మకూడా తినటంలేదు. మిగతా ప్లేట్లు అలాగే వున్నాయి.

"ఏమైందమ్మా?" అనాలని మనసులో కదిలింది. ఏం లాభం? ఒక్కోసారి చెప్పదు. వాళ్ళ వ్యవహారాలు పిల్లలకి చెప్తే వాళ్ళ గౌరవానికి చాలా భంగం. మళ్ళీ పిల్లలమీద పెత్తనాలు చెయ్యటానికీ కేకలెయ్యడానికీ వీలుండదు. మనసు విప్పి పిల్లలకి చెప్పి, వాళ్ళతో కష్టసుఖాలు పంచుకుందామని ఈ పెద్దవాళ్ళకి అని పించనే అనిపించదు.

పోనీ అడిగితే? అమ్మ మనసు కొంచెం తేలిక పడుతుందేమో! నిజమే గానీ తన మనసు చాలా బరువెక్కుతుంది. అమ్మ తప్పంతా నాన్నమీద చెప్తుంది. నాన్న, తప్పంతా అమ్మమీద చెప్తాడు. చాలా సార్లు, ఎవ్వరూ కరెక్ట్ అనిపించరు. ఆ మాటంటే ఇద్దరికీ కోపాలే. ఎవరికి వాళ్ళే తనని, తమ పక్షానికి లాక్కోవాలని చూస్తారు. ఒక్కోసారి నాన్న చాలా మంచిగా వుండి, వొక్కోసారి మహామూర్ఖంలోకి దిగుతాడు. అమ్మకూడా అలాగే వొక్కోసారి దేవతలా కనపడి, వొక్కోసారి రాక్షసంగా ప్రవర్తిస్తుంది. అమ్మ ఆఫీసునించి ఆలస్యంగా వస్తే నాన్నకి కోపం వచ్చే స్తుంది. ఏం ఆలశ్యంగా వొస్తే? అమ్మకి స్నేహితులూ సరదాలూ ఉండవూ? నాన్న డబ్బెక్కువ ఖర్చుపెడితే అమ్మ రుసరుస లాడుతుంది. డబ్బుని, ఖర్చుపెట్టు కోటానికి కాక, ఇంకేం చేసుకుంటారు? ఎవరేపని ఎందుకు చేశారో శాంతంగా ఆలోచించుకోరు. ఒకరు చెప్పే కారణాలు ఇంకోరు నమ్మరు. అసలు ఒకరి ప్రవర్తనమీద వొకరికి గౌరవం ఉండదు. కత్తులో శూలాలో విసిరినట్టు మాటలు విసురుకుంటారు రెండోవాళ్ళు విలవిల్లాడేటట్టు. ఒక్కోసారి ఇద్దరూ బద్ధశత్రువుల్లాగ .... వొకరి బాధ ఇంకోరికి ఆనందం కలిగేలాగ, ఒకర్ని వొకరు హత మార్చుకునేలాగ ....!

అలాంటి వ్యక్తులు భార్యా భర్తలా?.... జీవన సహచరులా? .... అంతేకాదు ప్రేయసీ ప్రియులు, ఇరవై ఏళ్ళకిందట! ఇద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టిన వాళ్ళు!

"మీ నాన్న చూడు, టిఫిన్ చెయ్యకుండానే వెళ్ళి నట్టున్నారు."

"ఊఁ...." అని పరాగ్గా తలెత్తి "ఉఁ...." అని తల దించేసుకుంది సుధ.

అమ్మకి తనతో మాట్లాడాలని చాలా ఇదిగా వుంది ఇప్పుడు. ఒక్కమాట అడిగితే అంతా చెప్పేస్తుంది. ఇప్పుడేం వినాలనిలేదు తనకి. కొందరు మనుషులు ఎదటివాళ్ళని రేడియోలాగ ఉపయోగించుకుంటారు. తమకి వినాలని వున్నప్పుడు మాత్రమే రేడియోని ఆన్ చేసినట్టు పలకరించి.... అక్కర్లేనప్పుడు... మూసేస్తారు.

చంద్రశేఖర్ ఇంకా రాలేదేం? ఈపూట నించే ఉద్యోగం చేసేస్తున్నాడో ఏవిటో!

తల్లకిందులుగా ఎంత చక్కగా పాకుతోందో చీమ గోడమీద! అదీ, బల్ల మీదికి దిగింది! పాపం, ఆక లేస్తోందేమో. అరె, గాబరాపడి వెనక్కి తిరిగి గోడెక్కు తోంది. టేబులే దానికి తల్లకిందులుగా వుందిగావును — నాన్న వ్యవహారంలాగ. వీటిక్కూడా ప్రేమలూ... వర్ణాంతరాలూ .... ఆఫీసులూ .... కోపాలూ .... ఉంటాయా?

వాన బాగా తగ్గిపోయిందే. నాన్న క్లబ్బుకి వెళ్ళిపోయాడన్నమాట. కోపంవొస్తే అన్నం మానెయ్యడం .... టిఫిన్ మానెయ్యడం .... అలక .... బెదిరింపు .... సిల్లీ! దేనికి నిజంగా బాధపడాలో, దేన్ని సమస్యగా పట్టించుకోవాలో, ఎంత వయసొచ్చినా తెలీటం లేదాయనకి!

అందర్లాంటి వాళ్ళుకారే! అదే ఆశ్చర్యం! రెండేళ్ళ కిందటెప్పుడో అమ్మా నాన్నా ఏదో వ్రతం చేసినప్పుడు, పీటలమీద కూర్చున్న వాళ్ళని చూసి అందరూ "ఆది దంపతుల్లా వున్నారు. సీతారాముల్లా వున్నారు" అని తెగ మెచ్చుకున్నారు. ఆది దంపతులు పోట్లాడుకుంటారో లేదో! సీత ఆఫీసునించి ఆలస్యంగా వొస్తే రాముడేం చేస్తాడో! "లక్ష్మణా! ఈమెని మెయిలెక్కించిరా!" అంటాడేమో! అది చాలా నయం, చెవిలో జోరీగలాగ సాధించేకన్నా.

అసలు అమ్మని పెళ్ళి చేసుకోడానికి వీలుగాకపోతే, ఆత్మహత్య చేసేసుకుందాం అనుకున్నాట్ట నాన్న! నిజంగా అలా చేసేసే వాడేమో! అప్పుడు నిజంగా అంత ఇష్టం వుండేదా? ఎంత గొప్ప ప్రేమో! చాలా గౌరవం కలుగుతుంది తల్చుకుంటే. అమ్మకి మేనరికం వుందట. నాన్నకి వేరే పెళ్ళి అయితే బాగా కట్నం వొచ్చేదట. పైగా ఇది కులాల్లో తేడా. నూతిలో కాళ్ళు పెట్టుక్కూచుందట నాన్న తల్లి. అమ్మ వెనకాల ఎన్నో హెచ్చరికలూ కాపలాలూ! పాపం నిజంగా ఎంత క్షోభపడ్డారో ఇద్దరూ. 'ప్రేమ' అనేది నిజమేనేమో! 'ప్రేమ ముందు ఏ హద్దులూ ఆంక్షలూ నిలబడవట! లేకపోతే అంత సాహసం ఎలా వస్తుంది? ఆ రోజుల్లో వర్ణాంతర వివాహం అంటే .... కొంచెం కష్టమే కదా? కానీ, వీళ్ళు నిలబడ్డారు!

అసలు 'వర్ణాంతర' ఏమిటి? శుద్ధ తప్పు. 'వర్ణ రహిత' అనాలి. కులాలూ మతాలూ పూర్తిగా లేవనుకోవాలి. లేవనే అనుకున్నారు. ఆ ప్రేమాకర్షణలో అవేం లేవనుకున్నారుగానీ, ఇద్దరి మనసుల్లోనూ ఉన్నాయి ఆ చాదస్తాలు. అమ్మ, నాన్న కులం గురించి ఎవ్వరికీ చెప్పదు. ఆమాటే మర్చిపోయింది. ఎవరికన్నా చెప్పాల్సివొస్తే 'బ్రాహ్మలం' అంటుంది. నాన్న అదే ఒప్పుకుంటాడు. నాన్నకి కూడా అదే ఇష్టం. తను, 'గొప్ప' కులంలో కలిసినందుకు గర్వపడుతున్నట్టు కనిపిస్తాడు.

అమ్మ బొత్తిగా అవసరంలేని సమయంలో కూడా ఏదో వీలుచేసుకుని .... "మా బ్రాహ్మల్లో పొట్లకాయ పచ్చడి ఇలాగే చేస్తారు" అంటుంది.

"మా బ్రాహ్మల్లో సంగీతం అంటే పడి చస్తారు."

"మా బ్రాహ్మల్లో .... మా బ్రాహ్మల్లో...."

అమ్మ బ్రాహ్మణ పాట పాడుతోంటే నాన్న ఎంత చక్కగా వంతపాడతాడో! మళ్ళీ ఒక్కోసారి ఏం జరుగుతుందో చాలా విసుక్కుంటాడు. "అస్తమానూ ఎందుకా మాటలు?" అంటాడు.

ఒక్కోసారి ఇంకా కోపం తెచ్చుకుంటాడు.

అబ్బ! ఎన్నాళ్ళు మభ్యపెట్టారో తనని!

బొంబాయి రేఖ కొత్తగా స్కూల్లోకి వొచ్చిన్నాడు .... పదేళ్ళవుతుందా? ఇంకో రెండేళ్ళు ఎక్కువేనేమో .... రేఖ ఎక్కడుందో .... ఎంత మంచిదో! .... అంత చిన్నప్పుడు "మీ కులం ఏమిటి?" అని బళ్ళో పిల్లలు అడిగితే, "బొంబాయి" అంది.

"ఊరు కాదు. కులం" అంటే,

"బొంబాయే" అంది.

"ఊరు కాదు మొర్రో, మీ కులం, కులం' అని పిల్లలంతా నవ్వుతోంటే తెల్లమొహం వేసింది.

ఆ పిల్ల కులం తమకు తెలీకుండా పోతుందేమోనని ఎంత నిరాశపడిపోయారో ఈ పిల్లలందరూ! అప్పుడు జానకేనా? అవును, దానికే అలాంటి బ్రహ్మాండమైన ఐడియాలు వొచ్చేవి. గుండెలమీద బాదుకుంటూ — "ఇలా చూడు. మేము బ్రాహ్మలం" అంది. పక్కపిల్ల భుజం మీద పొడిచి — "వీళ్ళు నాయుళ్ళు" అంది. ఇంకోపిల్ల వీపుమీద చరవబోతోంటే ఆ పిల్ల తప్పుకుని "కోమట్లం" అని చెప్పింది. ఇంకా కొందరు ఉత్సాహంగా ఎవరి కులం వాళ్ళు చెప్పుకున్నారు. కొందరు చిన్నమొహాలు చేసుకుని వెనక్కి తగ్గారు. అప్పుడు తనుకూడా చాలా గొప్పగా "మేం బ్రాహ్మలం" అంది.

ఏదో ఉపద్రవం ముంచుకొచ్చినట్టు ఇద్దరో ముగ్గురో తనమీద విరుచుకుపడ్డారు. "ఏయ్ సుధా! మీరు బ్రాహ్మలా? భలే అబద్ధాలు. మీరు అచ్చంగా బ్రాహ్మలేం కాదు. మీ నాన్నగారు...."

"ఊఁ, మా నాన్న? .... ఏవిఁటి మా నాన్న ....?"

"మీ నాన్న బ్రాహ్మలేం కాదు. కావాలంటే అడుగు."

తన కేమిటో విచిత్రంగా అనిపించింది. తనకన్నా వాళ్ళకి తెలిసినట్టు మాట్లాడేస్తోంటే తెల్లమొహం వేసుకుని నించుంది తను.

అప్పటికి అర్థమైంది రేఖకి అసలు సంగతి. "ఓహో! అదా మీరడిగేదీ? మా కలాంటివి లేవు. ఎప్పుడో — మా అమ్మకీ నాన్నకీ ఏవో వుండేవిట. తర్వాత అవన్నీ వాదిలేశారు. ఏమీ లేవని చెప్పేస్తారు మా అమ్మావాళ్ళు" అంది.

ఈ సారి ఈ సంగతి మిగతా పిల్లలకి అర్థంకాలా. తనక్కూడా అర్థంకాలా. పిచ్చిపిల్లని చూసినట్టు చూస్తు న్నారంతా రేఖని.

"పోనీ అలా చెప్పాలి. అంతేగానీ అబద్ధా లెందుకూ?" అంది జానకి, ప్రపంచాన్ని అబద్ధాల నించి రక్షించే భారం తనదే అయినట్టు.

తనకెంతో సిగ్గేసి ఏడుపొచ్చేసింది.

"అసలు కులం ఎందుకూ? ఏం చేస్తారు దాంతో!" అంటోంది రేఖ జానకితో. జానకేం చెప్పిందో తను వినలేదు. మొహం వేళ్ళాడేసి పుస్తకాలు పట్టు కుని గేటు దాటింది.

ఇంటికొచ్చి అమ్మని కావలించుకుని బావురు మంది "మనం బ్రాహ్మలంకామూ అమ్మా? మనం బ్రాహ్మలం కామూ?" అని స్వర్గలోకాల్లోంచి జారిపోతు న్నట్టు ఏడ్చింది.

"ఛ, వూరుకో! ఎందుక్కాదూ? ఎవరన్నారూ?" అంది అమ్మ ఆశ్చర్యపడి.

"మా బళ్ళో జానకీ వాళ్ళు .... నాన్న ఎవరోట కదా?" అని మళ్ళీ ఏడ్చింది.

ఏం? ఎవరో అయితే ఏం పోతుంది? బ్రాహ్మలు కాకపోతే ఏమౌతుంది? ఇప్పుడైతే అలా ఏడుస్తుందా తను? ఎంత అజ్ఞానంలో వుంచారో తనని. తను తొందరగానే ఆ హద్దుల్లోంచి బయటపడిందిగానీ, ఇప్పటికీ అమ్మ .... బయటపడిందా?

బాగా జ్ఞాపకం. అమ్మ చాలా చిన్నబుచ్చుకుంది అప్పుడు — "ఏదో వో కులం. అవన్నీ చిన్నపిల్లల కెందుకూ? ఇంకేం పన్లేదా వాళ్ళకి?" అని చాలా కోపం తెచ్చుకుంది.

నాన్నకూడా సంగతంతా విని — "అసలా వెధవ బడికి వెళ్ళొద్దను" అని నిప్పులు కురిపించాడు.

నిజంగానే ఆ బడి మాన్పించాలని ప్రయత్నాలు చేశారు. తర్వాత ఆలోచించినప్పుడల్లా ఎన్ని సందే హాలో! ఎన్ని బళ్ళల్లోంచి, ఎన్ని ఊళ్ళల్లోంచి పారి పోతాం? అంత తప్పు పనేం చేశాం? తనకి చిన్నప్పుడే నిజం తెలిస్తే తను ఎంత గర్వంగా చెప్పి జానకి నోరు మూయించేది! "నాకు కులమతాలు లేవు. ఏ మూర్ఖ త్వాలూ లేవు" అని చెప్తోంటే, ఎంత ఆనందంగా వుంటుందో ఎవరికైనా! ఈ ఆలోచనలన్నీ తనకేగానీ అమ్మకీ నాన్నకీ రావా? వాళ్ళకి ఈ ఆనందం రాదా?

సుధ, మొహం చిట్లిస్తూ కొంచెం తల తిప్పింది.

అమ్మ ఎందుకో కేకలేసి సుబ్బుల్ని చటుక్కున ఏదో తిట్టింది. సరిగ్గా వినపళ్ళేదు. తను వింటుందేమో నని భయమే అమ్మకి. ఎన్నిసార్లో వాదిస్తుంది తను. ఏం లాభం? మళ్ళీ ఆ తిట్టే! — "నీ శూద్రబుద్ధి పోనిచ్చుకున్నావు కావు" అనే వుంటుంది. తను పోట్లాడితే — "అబ్బ! ఏదో అలవాటై పోయింది లెద్దూ! ఏం ముంచుకు పోయింది?" అంటుంది. ఏదో ముంచుకుపోతూ ఉండాలన్నమాట ప్రతి దానికీ! నిజంగానే ఎవరైనా కులం పేరు ఎత్తగానే ఆకాశం మీదనించి ఒక పిడుగు పడిపోతూ వుంటే, భలేగా వుండును! ఛ! ఏం మనిషి! ఈవిడ కూడా చిన్నప్పుడు జానకిలాగ .... బళ్ళో పిల్లలందరి కులాలూ అడిగి వెక్కిరిస్తూ ఉండేదేమో!

"మీ భోజనం విషయాల్లో ఏమి సమస్యలు రాలేదా?" అని ఎవరన్నా అడిగితే "అబ్బే, లేదండీ! మా వారు దాదాపు బ్రాహ్మణ భోజనమే" అని ఊరు కుంటుంది. నాన్న ఎందుకో మరి చాలాకాలం ప్రయ త్నించాడు చేపలూ అవీ తినకూడదని. అసలు ఎందుకు ప్రయత్నించాలి? ఒకరి కిష్టమైన ఆహారం ఎందుకు మార్చుకోవాలి? జీవ హింస వొద్దనుకుంటే, అది వేరే సంగతి. నాన్న కొన్నాళ్ళు మానేసింది అందు క్కాదు. కానీ, బ్రాహ్మణ భోజనం కీర్తికన్నా నాన్నని చేపల రుచే జయించింది.

తనకి చిన్నప్పట్నించీ కోడిగుడ్లవీ తినటం అల వాటు లేకపోయినా సుశీలా వాళ్ళింట్లో ఆమ్లెట్ల రుచే తన అలవాట్లని కూడా జయించింది. అమ్మకి చెప్తే

అమ్మ కోపం చూడాలి. "ఆ బాబుకి తగ్గకూతురు వయ్యావు" అంది, చాలా అసహ్యించుకుని.

"నీ ఇష్టం. నీకేది ఇష్టమైతే అది తిను" అని అమ్మ చాలా శాంతంగా చెప్తే, నిజంగానే తను అమ్మ ఇష్టానికి వ్యతిరేకంగా చేసేది కాదు. అమ్మలకి అంత చిన్న విషయాలు తెలిస్తే పిల్లల్ని కట్టిపడేసుకోడం ఎంత సేపు! ఎంత తేలిక!

మళ్ళీ స్నేహితులలో, ఇతర్లో పలకరిస్తే ఎన్ని కబుర్లో — వర్ణాంతర వివాహం .... సంఘ సంస్కారం .... సింగినాదం .... బోలెడు! అమ్మేకాదు, నాన్న కూడా! నాన్నకి కూడా అమ్మకులం మీదే మోజు!

ఇదిగో అమ్మాయ్! ఇంత తలబద్దలు కొట్టుకోడం ఎందుకు? వర్ణాంతర వివాహానికి అర్ధం కులాల మూర్ఖత్వంనించి బయటపడటం కాదు. 'అసలు కులమే లేకపోవడం' కాదు. 'చిన్నకులం చాలా వినయంగా పెద్దకులం' ముందు మోకరిల్లుతుంది. పెద్ద కులం అప్పుడప్పుడూ కళ్ళుదించి చూసి — "ఓ నువ్వా? సరే, అల్లా పడివుండు" అని హడావుడిగా ఏ సంఘ సంస్కార సభకో, ఇంకో వర్ణాంతర వివాహానికో పోతూ వుంటుంది. అర్ధమైందా? చాలా సింపుల్! ఎవరిది సంఘంలో పెద్దకులం అయితే అది ఆ ఇంట్లో చలామణీ అవుతూ వుంటుంది. అదన్నమాట! వర్ణాంతరం అంటే. తెలిసింది. — మరి రేఖా వాళ్ళింట్లో ....? ఆ ఎక్కడో ఎవరో!

"అంత నిద్రొస్తోంటే ఆ పాలు తాగేసి వెళ్ళి పడుకో రాదూ? తల తడిగా వుంది, తుడుచుకో బాగా."

సుధ పాలగ్లాసు అందుకుంది తలెత్తి.

చంద్రశేఖర్ ఉప్మాతింటున్నాడు.

"అరె! ఎప్పుడొచ్చారు మీరు?"

"ఇప్పుడే ...." ముభావంగా అన్నాడు. రెండు నిమిషాల్లో కాఫీ కూడా పూర్తిచేసి వెళ్ళిపోయాడు గదిలోకి.

సుధ పాలగ్లాసు ఖాళీచేసి వెళ్ళేసరికి అతను బట్టలు సర్దుకుంటున్నాడు.

"ఏమిటి, హడావుడి పడుతున్నారు?"

"నేను వెళ్తున్నానండీ."

"ఎక్కడికి?"

మాట్లాడలేదు. ఏవేవో కాయితాలు సూట్‌కేసు అడుగున పెట్టాడు. దుప్పటీ మడత ప్రారంభించాడు.

"మీ ఇంటర్వ్యూ ఏమైందండీ?" సంకోచంగానే అడిగింది.

"ఏమౌతుందో అదే అయ్యింది."

"అంటే?"

"రాలేదండీ" విసుగ్గా అన్నాడు. కానీ అది నిరాశ. దుప్పటి మడతలు ఆపి "ఉద్యోగాలు రావని తెలిసి కూడా రెండేసి మూడేసి వందల మైళ్ళనించీ ఇంటర్వ్యూల కొచ్చే మూర్ఖుల్ని ఏమనాలి? సర్లెండి. బతకటం సమస్యకాదు. రిక్షా లాక్కోవొచ్చు. లారీ తోలుకోవొచ్చు" దుప్పటి సర్ది చొక్కా తీసుకున్నాడు మడతలకి.

సుధకి ఏమనాలో తోచలేదు. పరిస్థితి కొంచెం తేలిక పరచటానికి నవ్వి — "రిక్షా లాక్కోటానికి ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చెయ్యాలా?" అంది.

"అది అప్పుడర్థం కాలేదు" అతను పైకి ఏడవలేక, అంతే. ఎంత బాధ, దుఖ్ఖం బిగబట్టుకున్నాడో, ఆ కంఠంలోంచి పలికే వాక్కశబ్దం వింటే చాలు. కళ్ళు తడితడిగా మెరవటం కూడా చూసింది సుధ.

మనసంతా .... పూర్తిగా అతని కోసం చాలా దిగులు కలిగింది. వచ్చిన్నాడు అతని ఒంటిమీద బట్టలూ, చేతిలో పాతపెట్టీ, నలిగిపోయిన చెప్పులూ చూస్తే అతని పేదతనం స్పష్టంగా తెలిసిపోయింది. దానికతను ఏమీ సిగ్గుపడకుండా ప్రవర్తిస్తాడు. అతను తెచ్చుకున్న దుప్పటికీ తువ్వాలుకీ ఎన్ని కుట్లో! వచ్చిం తర్వాత వరసగా నాలుగు రోజులు ఒక్క చొక్కాయే రాత్రిళ్ళు ఉతికి వేసుకున్నాడు. అది కొంచెం బాగుంది. "కర్ణుడికే కాదు, ఇతనిక్కూడా కవచం వుంది" అని నవ్వుకుంది తను. ఆ పేదతనం అతని బట్టలకీ చెప్పులకేగానీ, స్వభావానికీ ప్రవర్తనకీ లేదనిపించింది చూస్తోన్న కొద్దీ.

అతను సూట్‌కేస్ మూసి లేచాడు.

"అయితే నిజంగానే వెళ్తున్నారా?" అంది సుధ తనకేమీ ఇష్టం లేనట్టు.

"మరేం చెయ్యమంటారు? ఇప్పటికే వారం రోజుల్నుంచీ మీ ఇంట్లోపడివున్నాను."

"ఎప్పుడు పోదాం — అనిపిస్తోందా మా ఇల్లు?"

నిరుత్సాహంగా నవ్వాడు — "వొచ్చిన పని అయిపోయింది కదండీ?"

"ఎక్కడైంది? ఇది రాకపోతే నాన్న ఇంకెక్కడో ప్రయత్నిస్తానన్నాడుగా? ఇంత తొందరపడి వెళ్ళి మీ ఊళ్ళోకూచుని ఏం చేస్తారు!"

"ఎప్పటికప్పుడు అర్థంలేని ఆశేగానీ ఎందుకండీ, ఆయనకి ఇబ్బంది...."

"ఇబ్బందా? మనం చెయ్యగలిగే పని చేసి పెట్టడం ఏం ఇబ్బందండీ? పోనీ ఇబ్బందైనా, మీకు ఉద్యోగం వొచ్చినప్పుడు ఆయనకి ఎంతానందం కలుగుతుందో కూడా ఆలోచించండి!"

అతను మాట్లాడలేదు.

"మీరేమైనా అనుకోండిగానీ ఇతర్లకి సహాయం చేసి ఆనందపడే వాళ్ళే ఇతర్లని నమ్మి సహాయం తీసుకోగలరు. నా చిన్నప్పుడు మా ఊళ్ళో వొక గడ్డం తాత ఉండేవాడు. మమ్మల్నందర్నీ ఎప్పుడూ ఎత్తుకుంటూ నవ్విస్తూ ఆడిస్తూ సంతోషపడేవాడు. కంట్లో నలకతీసీ, కాల్లో ముల్లుతీసీ — 'బాగుందా ఇప్పుడు? నెప్పి పోయిందా ఇప్పుడు?' అని అడిగి అడిగి సంతృప్తి పడేవాడు. అసలు సహాయం అన్నమాటవస్తే నాకెప్పుడూ ఆ తాతే గుర్తొస్తాడు. మనం చేసేవి కూడా సహాయాలేనా?"

చంద్రశేఖర్ చాలా మొహమాటంగా "సరే, రేపు వెళ్తానులెండి" అన్నాడు.

సుధ కొంచెం నవ్వి — "రేపటికి జరిగారు కదా?" అంది.

"కాదులెండి. రేపు వెళ్ళిపోవాలి."

"అబ్బ! రేపు సంగతి మర్చిపోండి. ముందు మీరు స్నానం చేసిరండి. మనం బయటికి వెళ్దాం."

"ఈ వానలోనా? ఎక్కడికి?"

"అలా అడగాలా? మీరు రమ్మంటే నేనలా అడగను. మనకేమీ ఇబ్బందిలేని విషయాల్ని వూరికే ప్రశ్నించి తర్కించకూడదు. పోనీ మీకు కాళ్ళు నెప్పా? తిరిగి తిరిగి వచ్చారా? ఆ మాటే చెప్పండి."

"సర్లెండి. మీ ఫిలాసఫీతో నేనెక్కడ మాట్లాడగలను?" అని బట్టలు తీసుకుని స్నానానికి బయల్దేరాడు.

★ ★ ★

వాన కురిసి వెలిసిన ఆకాశానికి కుంకం రంగులొచ్చాయి. ఆత్రుతకొద్దీ బొమ్మలు వేస్తోన్న కొత్త చిత్రకారుడు ప్రయోగాలు చేసి సరికొత్త రంగులు తయారుచేసినట్టు ఆకాశం విచిత్రంగా మెరుస్తోంది.

"ఈ రంగులన్నీ మీ రెప్పుడన్నా చూశారా?" అంది సుధ ఆశ్చర్యంగా.

"చాలాసార్లు వాన వెలిసిపోయిం తర్వాత ఆకాశం ఇలాగే వుంటుంది."

"ఏమో! నేనెప్పుడూ చూసినట్టు లేదు. చెట్లకీ గడ్డికీకూడా కాంతులొచ్చాయి. ఈ మెరిసే నీరెండనీ .... నీటి చుక్కల్నీ కూడా ఎంత గొప్పగానో వర్ణిస్తారు కదా కవులు? మనకా అదృష్టం లేదు."

"చూసి ఆనందించటమే మన అదృష్టం."

నీరెండ పడి చెట్లన్నీ వొకవేపు తళతళ మెరుస్తున్నాయి. ఇంకా ఆకుల్లోంచి నీటి బొట్లు రాలుతున్నాయి. వాలుగాపడ్డ చెట్ల నీడల మీదనించి నడుస్తూ —" చూడండి. చెట్లన్నీ నేలమీద పడుకున్నాయి విశ్రాంతికి" అన్నాడు, సుధ మొహం చూస్తూ. అలాంటి భావనలు ఆమెకి చాలా ఇష్టం అని తెలుసు అతనికి.

"అవును, అందంగా చెప్పారు" అంది సుధ — "ఈ వాన కడిగిన రోడ్లని చూస్తోంటే మీకో కథ గుర్తు రావటం లేదూ?" అని అతని మొహం చూసింది.

"చాలా కథలున్నాయి, మీ కథ చెప్పండి ముందు."

"రావణాసురుడి రాజ్యంలో రోజూ చీకట్నే గాలిదేవుడొచ్చి నేలంతా తుడిచేసే వాడంట! తరవాత వానదేవుడొచ్చి చక్కగా నీళ్ళు చల్లేవాడంట! తర్వాత ...."

"ముగ్గు దేవుడొచ్చి ముగ్గులేసేవాడా?"

"కాదులెండి. ముగ్గులు ఆ దేశంలో వాళ్ళే పెట్టుకునేవారు."

"ఆ పని కూడా ఒక దేవుడికి అప్పజెప్పేస్తే పోతుంది కదా? చచ్చినట్టు చేసేవాడు. దేవుళ్ళతో ఏదో ఒక పని చేయించాలి. లేకపోతే, పూటపూటా నైవేద్యాలు తింటూ కూర్చోడం మరిగారు."

సుధ బాగా నవ్వింది.

"ఇంతకీ మనం...." చటుక్కున ఆగాడు. "వెళ్తోం దెక్కడికి?" అని అతను అడగబోయిన ప్రశ్న.

"జడుసుకోకండి! మిమ్మల్ని కీకారణ్యాల్లోకి తీసు కెళ్ళను. అక్కడకూడా మనుషులుంటారు. రోడ్డు పొడుగునా లైట్లుంటాయి. బస్సు లెప్పుడూ తిరుగు తూంటాయి. ఎంత దూరం పోయినా వెనక్కిరావచ్చు."

"ఛ, ఛ! అదేంకాదు. ఇంక నేనేం అడగను, చూడండి."

"పైకి అడక్కపోవటం కాదు, మనసులో కూడా అడగాలని అనుకోకూడదు."

"మనసు సంగతి మీకెందుకు? మీ వెంట నడిచి వొస్తున్నాను కదా?"

"కొందరు మనల్ని 'మీ కులం ఏమిట'ని స్పష్టంగా అడగరు. కానీ ఎదటి వాళ్ళ కులం తెలుసు కోవాలని మహా యాతనపడుతూ వుంటారు. పైకి చెయ్యకూడదని వొదిలేసిన పనులకి మనసులో కూడా ఘర్షణ వుండకూడదు."

"చాలా అన్యాయం అండీ ఇది. ఎక్కడికో చెప్ప కుండా తీసుకుపోతూ, పైగా, 'మనసులో అనుకోకు, ఆత్మలో అనుకోకు' అని ఆంక్షలు కూడానా?"

సుధ రాజీకొచ్చింది — "ఇంకెక్కడికైనా తీసికెళ్తే నా పరువు పోగొడతారు కూడానూ. ఇక్కడికేనండీ బాబూ! చక్కటి పార్కువుంది. కాస్సేపు కూచుని, మీ కేమన్నా సినిమా పిచ్చి వుంటే సెకండ్ షో చూసి ...."

"అర్థరాత్రవుతుంది ఇంటికి వెళ్ళడానికి. అదేం పని?"

"ఏం, అర్థరాత్రయితే? మనకు దారి తెలుసుగా?"

"నేననేది దారితెలీదనా? మీ అమ్మగారూ నాన్న గారూ ఏమన్నా అనరూ?"

"అంటారూ. అనకపోతే 'అమ్మలూ, నాన్నలూ' ఎలా అవుతారు? మాట్లాడకుండా పోయి పడుకుంటే సరి!"

"అంతేగానీ సినిమా మానకూడదన్నమాట!"

"అది మంచిపని కాకపోతే మానాలి. జడిసి మానకూడదు."

"పెద్ద వాళ్ళు వొద్దనేది కూడా అది మంచి పని కాదనేగా?"

"అయ్యో! మీరు చాలా వెనకబడి వున్నారు అయితే. పెద్ద వాళ్ళకి నిజంగా మంచి చెడ్డలు తెలిసే చెబుతారనుకుంటున్నారా? పిల్లల మీద పెత్తనం కోసం ఏదో వొకటి చెపుతూ వుంటారు."

"ఇది మరీ అన్యాయం! ఇలా అనుకుంటే మరి తల్లిదండ్రుల్ని గౌరవించడం ఎలాగ?"

"అయ్యో! అయితే మీరు ఇందాకటి కన్నా వెనకబడి ఉన్నారు. మీకు ఇది కూడా తెలీదన్న మాట! తల్లి దండ్రులికీ, మనం గౌరవించడం అక్కర్లేదండీ! గౌరవిస్తోన్నట్టు కనపడ్డం కావాలి. తిట్టినప్పుడు తల వంచేసుకుంటే, అది చాలు!"

"చాలా అన్యాయం మీరు!"

సుధకి ఉపన్యసించే ఆవేశం వచ్చేసింది. "అన్యాయానికి అన్యాయంగాక? ఈ చెంపమీద కొడితే ఆ చెంప ఇవ్వండి. అప్పుడన్నా వొళ్ళు మండి కలబడక తప్పదు. కాలేజీల్లో యూనివర్శిటీల్లో చదివి, పరీక్షలు పాసై, ఉద్యోగాలు చేస్తూ, తమంత అయి పోయిన వాళ్ళమీద కూడా ఈ తల్లిదండ్రులు పెత్తనాలు సాగిస్తారు. అసలు పెత్తనం అంటే మూడు కాళ్ళతో సిద్ధం, మన అమ్మలూ నాన్నలూ అన్నలూ, భర్తలూ అత్తలూ! లిస్టు చాలా పొడుగు లెండి. మొన్న మా క్లాస్‌మేట్ ఒకమ్మాయి పెళ్ళికి ఇంట్లో ముసలమ్మ దగ్గర్నించి ఇరుగు పొరుగుల్దాకా వ్యతిరేకించారు. 'మీ దిక్కున్న చోట చెప్పుకో మ'ని ఆ అమ్మాయి రిజిష్టర్ మేరేజ్ చేసుకుని వెళ్ళిపోయింది. అప్పుడేం చేస్తారు వీళ్ళు? .... పిల్లలు లెక్కలేకుండా తిరస్కరించే దాకా తెచ్చుకుంటారు. అసలు పిల్లల ప్రవర్తన మీద పెద్ద వాళ్ళకి విశ్వాసం వుండదు, ఎందుకండీ? .... సర్లెండి .... విసిగిస్తున్నాను మిమ్మల్ని."

"ఛ, విసుగేం కాదు. చెప్పండి, సరదాగా వుంది."

"సరదాగా వుందా, నేనింత సీరియస్‌గా చెప్తొంటే?"

"సీరియస్‌గా మాట్లాడే వాళ్ళని నేనెక్కడా చూడ లేదు. అందుకే సరదాగా వుంది."

"అదికాదండీ! మనం సినిమా చూసో చూడకో ఆలస్యంగా ఇంటికెళ్తాం అనుకోండీ. కారణం అడిగి, 'అలాగా?' అని వూరుకుంటే నిజంగా ఎంత గౌరవం కలుగుతుందీ పెద్దవాళ్ళమీద! 'ధాం ధూం' అని గంతులేసి పోట్లాటకి దిగితే పైకి భరించినా ఎంత చీదర మనసులో! వాళ్ళ తిట్లకి వినయంగా తల వొంచుక్కూచుంటే తమ పెద్దరికం నిలిచిందని ఎంత

మురుస్తారో! దాన్ని ఊడగొట్టటానికి వొక్క క్షణం పట్టదు. జాలిపడి నిలబెడతాం గాని...." ఆగి చంద్ర శేఖరం మొహం చూసింది.

సుధ ఎందుకంత తీవ్రంగా మాట్లాడుతోందో అతనికి ఆశ్చర్యంగా వుంది. "కానీ సుధగారూ! పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం కాదు. సినిమాకి వెళ్ళి వచ్చినందుకు తిట్టకూడదేమోగానీ, మా ఊళ్ళో బోలెడుమంది మొగపిల్లలు పేకాటలాడి అర్ధరాత్రుళ్ళు ఇళ్ళకొస్తారు. తాగి తందనాలాడుతూ ఇళ్ళకొస్తారు. ఒకడైతే, ఇంట్లోవాళ్ళకి తెలీకుండా బోలెడు అప్పులు తీసుకున్నాడు. అలాంటి వాళ్ళని కూడా తల్లిదండ్రులు ఏమీ అనొద్దా? అసలు వాళ్ళతో తెగతెంపులు చేసేసు కోవాలి!"

"సరిగ్గా చెప్పారు. మరి, ఆ పిల్లల్తో అంత గట్టిగా వుంటారా తల్లిదండ్రులు? అదేం చెయ్యరు. అలాంటి రౌడీ కొడుకులకే కట్నాలతో పెళ్ళిళ్ళు చేస్తారు. ఆస్తులు అప్పజెపుతారు. అలాంటి తల్లిదండ్రులేనా 'గౌరవ నీయులు?' "

"వాళ్ళు, మనకి గౌరవనీయులు కాకపోవచ్చు. వాళ్ళనించి ఆస్తులు తీసుకున్న పిల్లలకి గౌరవ నీయులా కారా?"

"అబ్బా! మీరూ తెలివైన వారేనే! నేనొక్కదాన్నే. చాలా తెలివైనదాన్నేమో అనుకుంటున్నాను ఇన్నాళ్ళూ. సర్లెండి. మీరింకా .... ఇంటర్వ్యూ సంగతి ఆలోచి స్తున్నారా?"

"ఏ ఇంటర్వ్యూ సంగతి? .... ఓహో అదా? అబ్బే, లేదండీ! అలవాటైపోయింది. ఏం చేస్తాం? ఈసారి నిజంగానే ఈ ప్రయత్నాలన్నీ మానెయ్యాలి. మా ఊళ్ళో ఇంటర్వ్యూ కార్డులుకూడా రాని పి.హెచ్.డీ. వున్నాడు, తెలుసా?"

"నిరాశలూ, కష్టాలూ అందంగా వుంటాయని ఎవ్వరూ అనరుగానీ .... భరించాలి. లేకపోతే విప్లవాలు తెచ్చుకోవాలి. అంత శక్తిమంతులం అయ్యేవరకైనా దీన్ని భరించాలి."

"భరిస్తాం. ఇంకో దారిలేదు. కాబట్టి అదే చేస్తాం. కానీ ఎంతశక్తీ, ఎంత ఉత్సాహం, ఎన్ని తెలివితేటలూ వృధా అయిపోతున్నాయో మన ఊహకి అందదు. నేనే ఉన్నాననుకోండీ, కొంచెమైనా ఆదర్శంగా బతకాలనే ప్రయత్నిస్తాను. కానీ, ఎన్నాళ్ళు నిలుస్తుందీ పళ్ళ బిగువు? ఖండఖండాలుగా తెగిపోవాలి నేను. నిలువు దోపిడీ ఇచ్చెయ్యాలి ఆదర్శాలకి. ఏ మనిషైనా ఎన్నాళ్ళు నిలబడతాడు నీతికి? ఎక్కణ్ణించి వొస్తుంది అంత ఆత్మబలం? నాకు తెలిసిన వొకాయన దొంగ నోట్ల వ్యవహారంలో తిరుగుతుంటాడు. బోలెడు సంపాదించాడు. పోలీసులకు తెలిసి కూడా వూరు కుంటారు. అలాంటివన్నీ చూస్తూ ఈ ఉద్యోగాలకోసం ఎందుకు ప్రాధేయపడాలి? ఈసారి నేను ఆయన్ని కలుసుకుని మాట్లాడాలి."

సుధ నవ్వింది. "ఇక వొచ్చే సంవత్సరంనించీ ఈ ఇంటర్వ్యూలూ, ఆశ నిరాశలూ నాక్కూడా అర్ధ మౌతాయి" అంది.

"మీకు నిరాశా? ఎందుకూ?" అన్నాడతను ఆశ్చర్య పడుతూ.

"ఎందుకేవిటీ? నాకు మాత్రం ఉద్యోగం వస్తుందా? బతకటం ఎలాగ? దొంగనోట్ల వ్యాపా రంలో నన్నుకూడా చేర్చుకుంటారా?"

"మీకేం ఖర్మండీ? ఏ డాక్టర్నో ఆఫీసర్నో పెళ్ళి చేసుకుంటారు! బతకటాని కేం లోటు?"

"ఛీ ఛీ! నేను మీకు అలా కనిపిస్తున్నానా? పెళ్ళి చేసుకోవటం బతుకుదెరువు కోసమా? మంచివారే! — మీరు కూడా ఇలాంటి మాటలేనా?"

అతను నవ్వి — 'రెండు చిక్కు సమస్యలు పెట్టారు మీ వాక్యంలో. 'మీరుకూడా' అంటే. 'మీరు'కి ప్రత్యేక తేమిటి? 'ఇలాంటి మాటలేనా?' అన్నారు. అంటే, ఆ మాటల్లో దుష్టత్వం ఏమిటి? చెప్పండి ముందు!" అన్నాడు.

సుధ దారిమార్చి విరిగిపోయిన గేటులోంచి గతు కులు పడ్డ దారిలోకి నడిచింది.

దూరంగా చాలా చెట్లు కన్పిస్తున్నాయి. చుట్టూ ఫెన్సింగ్ తెగిపోయి వుంది. అక్కడక్కడా సిమెంటు అరుగులు పెచ్చులూడి ఇటికలు బయటపడి వున్నాయి. వర్షంపడ్డ నేలంతా తడితడిగా అక్కడక్కడా నీళ్ళు నిలిచివుంది. పచ్చగడ్డి వొత్తుగా పెరిగి కాళ్ళకింద మెత్తగా వుంది.

"మొన్నోసారి ఇటు వెళ్తూ చూసి ఇదేదో చిట్టడవి అనుకున్నానే!" అన్నాడు.

"ఇది సినిమాల్లో పార్కులాగ షోగ్గా వుండదని ఎక్కువమంది రారు ఇక్కడికి. అధికారులు కూడా దీని సంరక్షణ వొదిలేశారు."

"అయితే ఇదికూడా పార్కేనా? నయం. ఉద్యాన వనం అన్నారు కాదు. మొత్తంగా అడవిలోకి తీసు కొచ్చారు నన్ను."

"అడవుల్లో జీవితం ఎలా వుంటుందో తెలీదు గానీ, ఇక్కడ వెన్నెల రాత్రుల్లో చెట్ల కిందనించి మాట్లాడుకుంటూ నడుస్తోంటే ఎంత ఆనందంగా వుంటుందో చూడండి ఇవ్వాళ."

"పులులూ అవీ వుండవూ ఇందులో?"

"ఉంటాయి. మొన్న జ్యూ నించి ఒక సింహం తప్పించుకొచ్చి ఇందులో పడిందంటున్నారు. మీరు వేటాడతారనే తీసుకొచ్చాను."

చెట్లకింద నేల కొంత పొడిగా వుంది. కొంత దూరం నడిచి పొడి చోటు చూసుకుని కూర్చున్నా రిద్దరూ. చెట్టు కొమ్మల పైనించి ఆకాశం కనపడటం లేదు. వెన్నెల అక్కడక్కడా జారుతోంది.

సుధ వెన్నెల్లోకి జరిగి కూచుంది — "అసలు మీకో విషయం చెప్పాలని బయల్దేరాను!"

"మధ్యలో రావణాసురు డొచ్చాడు."

"ఒదిలేశాంగా ఆయన్నీ?"

"అయితే చెప్పండి తొందరగా. నా కసలే దడగా వుంది. ఈ కారడవిలో కూచోటం."

"మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. సింహం వొస్తే ముందు నన్ను తిని ...."

"తర్వాతైనా నన్ను తింటుంది కదా?"

"అంతలో పారిపోలేరూ మీరు? అయినా జంతు వులు అంత దురాశగా వుండవండీ! దానికి నాతో కడుపునిండిపోతే ఇంక మీ జోలికి రాదు."

"మిమ్మల్ని కాస్త వాసన చూసి, మీ ఘాటుకి, మీరు దానికి రుచించకపోతే .... మీ కఠినత్వంతో దానికెలాగూ రుచించరు .... ఇక నా మీద పడుతుంది. .... ఈ బతికి వున్న కాస్సేపూ గబగబా మాట్లాడు కుందాం. ఏదో చెపుతానన్నారుగా?"

"ఉపోద్ఘాతాలూ ముందు మాటలూ ఏమీ లేకుండా చెప్పెయ్యనా?"

"చెప్పెయ్యండి. అవన్నీ నేను రాసుకుంటాను."

"అయితే సరే, మా బళ్ళో ఓ పంతులుగా రున్నారు. అంటే అర్థమైందా?"

"మీ కాలేజీలో లెక్చరర్ అన్నమాట. పాపం ఆయనేం చెయ్యబోతున్నారు?"

"ఛ! ఏమీ చెయ్యల్లేదండి. ముందే క్లయిమాక్స్ సీను చెప్పేస్తున్నాను. ఆయనకి నా మీద చాలా ప్రేమ పుట్టిందట. నన్ను పెళ్ళిచేసుకోవాలని వుందట! అటో ఇటో తేల్చి చెప్పెయ్యమని దారికడ్డంగొట్టి అడిగాడు."

"ఎటు తేల్చారు మరీ?"

"తిన్నగా ఇంటి కొచ్చాను."

"ఏం, ఇష్టం లేదా ఆయనంటే?"

"ఆయనంటే ఇష్టమే. ప్రేమంటే ఇష్టం లేదు."

"ఏవిటో తిరకాసుగా వుంది, మీ వ్యవహారం."

"నాకూ అలాగే వుంది ఆయన వ్యవహారం. అసలు ఈ ప్రేమల్లో మీకేమైనా నమ్మకం వుందా?"

"అందులో మాత్రమే వుంది."

"అయితే మనం చాలా వాదించుకోవచ్చు."

"మీకు పుణ్యం వుంటుంది. అందులోకి దించ కండి! మీ లెక్చరర్‌కి ఏం చెప్పారో చెప్పండి."

"ఏం చెప్పలేదు. ఏం చెప్పాలో తేల్చుకోలేదింకా."

"ఆయన అడిగి ఎన్నాళ్ళయింది?"

"అయిందిలెండి ఒక సంవత్సరం!"

"ఆఁ, సం.. వ.. త్సరమా? ఇంకా చెప్పలేదా?"

సుధ నవ్వింది — "కాదులెండి! వారం అయింది."

"......................"

"అసలు .... దేవదాసుకీ పార్వతీకీ పెళ్ళయితే, వాళ్ళ జీవితం ఎలా వుండేదంటారు?"

చంద్రశేఖర్ తెల్లబోయాడు — "ఇప్పుడు దేవ దాసు గుర్తొచ్చాడా?"

"ఎప్పుడూ గుర్తొస్తాడు.... నేనడిగింది చెప్పండి!"

"దేవదాసుకీ పార్వతీకీ పెళ్ళా? అసలెలా అవు తుంది?"

"ఎలాగో అయిందనుకోండీ!.... దేవదాసే పెద్ద వాళ్ళని ధిక్కరించాడనుకోండీ."

"అలా అయితే ఇంకేం? చాలా బాగుంటుంది."

"బాగుంటుందా? అలాక్కాదు. సరిగ్గా ఆలోచించి చెప్పండి."

అతను నవ్వాడు "ఏమీ బాగుండదంటే సరిగ్గా ఆలోచించినట్టా?"

సుధకూడా నవ్వింది — "మీ రసలు కాస్సేపు ఆలోచించి తర్వాత చెప్పండి" అని మొరాయించింది.

"కొత్తగా ఆలోచించటాని కేముంది? పెళ్ళయితే సుఖంగానే వుండేవాళ్ళు. వాళ్ళ ప్రేమమీద నాకేం సందేహం లేదు."

సుధ వెటకారంగా చూసింది — "అంత గొప్ప ప్రేమయితే మరి పెళ్ళెందుకు చేసుకోలేదు? అది పార్వతి చేతిలో లేదనుకోండీ. దేవదాసు చేతిలో వుందిగా?"

"దేవదాసు చేతిలో వుండడం నిజమేగానీ, ఆ సంగతి దేవదాసుకే తెలీదండీ! 'పెద్ద వాళ్ళు వొప్పుకోకపోతే ఇంకేం చెయ్యగలం?' అనుకున్నాడు మొదట. అతనికి తెగింపు వచ్చేటప్పటికి, అతని చెయ్యి దాటిపోయింది. అతని చేతిలో మాత్రం ఏం వుంది? మొదట్లో అతను అమాయకంగా వున్నాడు కాబట్టి, అతని ప్రేమని శంకిస్తారా? ఆ ప్రేమ ఎంత నిజమో తర్వాత జీవితంలో రుజువైందికదా? ఇంకో స్త్రీని కన్నెత్తి చూడలేదు."

"......................."

"ప్రేమకి సార్ధకత కలిసి జీవించటమే అనుకోండీ. కాదనను. కానీ అది అసంభవమైతే మనసుల్లో ప్రేమ అంతా అబద్ధమేనా? దేవదాసూ పార్వతీ విడిపోయా రని నాకెప్పుడూ అనిపించదు" అని ఇక దానికి తిరుగు లేదు అన్నట్టు వూరుకున్నాడు.

సుధ తెగ ఆశ్చర్యపడి పోయింది — "వాళ్ళిద్దరూ విడిపోనే లేదూ? కలిసే ఉన్నారా? ఎక్కడా? అంత రాత్మల్లోనా? ఆహా! ఏం వేదాంతం మాట్లాడుతున్నా రండీ! దేవదాసూ పార్వతీ 'ఇద్దరం కలిసే వున్నాం' అనుకుంటూ సుఖంగా వుండలేకపోయారేం?"

"మీ లెక్చరర్ని వొదిలేసి ఇందులో పడ్డారేం?" అని నవ్వాడతను.

"మీరలా తప్పించుకోకండి మరి. ఈ ప్రేమ వ్యవ హారాల్లో నాకు చాలా సందేహాలున్నాయి. దేవదాసు ప్రేమమీద నేనో వ్యాసం కూడా రాశాను."

"ఏం రాశారు?" నవ్వుతూనే అడిగాడు.

"మీకేవిటో హేళనగా వుంది నా రీసెర్చిమీద. మీరు నా సందేహాలన్నీ తీర్చేస్తే నా అభిప్రాయాలు మార్చుకుంటానుగా?" అని మళ్ళీ వాదంలోకి దిగింది. "అసలు పార్వతి అంత సాహసంగా అర్ధరాత్రి వొచ్చి అడక్కపోతే దేవాదసుకి ప్రేమా గీమా ఏం లేదు. ఇంకా చదువుకునేవాడు. జమీందార్ల పిల్లని పెళ్ళి చేసుకునే వాడు. అంతే"

"నేనలా అనుకోను. మీరు దేవదాసుమీద కోపంతో వున్నారు. అందుకే అలా ఆలోచిస్తున్నారు. పార్వతివొచ్చి అడక్కపోయినా, పార్వతికి పెళ్ళయి వెళ్ళిపోయిం తర్వాత దేవదాసు చాలా బాధపడేవాడు. ఆమెతో అతనికి ఆ రకం స్నేహం వుంది, ఆత్మీయత వుంది. ఇష్టం వుంది."

"ఎన్నివున్నా అదంతా ప్రేమ కాదు. చాలా తొందర గానే మర్చిపోయేవాడు."

"సరే, అలాగే అనుకోండి. పోనీ పార్వతి అడిగిం తర్వాతే అతనికి ప్రేమ తెలిసిందనుకోండి. పార్వతే అతని మనసులోకి ప్రేమ ఊహ తెచ్చింది. నిజమే. అతని ప్రేమ ఎప్పుడు ప్రారంభమైతేనేం? ఎలా ప్రారంభమైతే నేం? — మీ లెక్చరరు మీ మీద ఇష్టం వున్నట్టు చెప్పారనుకోండీ. ఆ క్షణంనించీ మీకూ ఆ వ్యక్తిమీద ప్రేమ కలగవచ్చు కదా? ప్రేమని ఎవరో ఒకరే ముందు బయటపెడతారు. రెండోవారు తర్వాత దాన్ని గురించి ఆలోచిస్తారు. అడిగిన వ్యక్తికే ప్రేమ వుందనీ, రెండో వ్యక్తికి లేదనీ అనుకుంటామా? ఇద్దరూ ఒక్కసారే అడుగుతారా? ఎవరో ఒకరు ముందు అడుగుతారు."

సుధ అతని మాటలన్నీ శ్రద్ధగానే వింది "మనం కథ ప్రకారమే మాట్లాడుకోవాలి. దేవదాసు ప్రేమ అంతా, పార్వతి పూర్తిగా దూరం అయిపోయాక ప్రారంభమైందే. ఆమెని పెళ్ళిచేసుకోడానికి వీలు న్నంత కాలమూ పార్వతే కావాలని అతనికేమీ పట్టు దలలేదు. — అలాంటి పరిస్థితిలో, పార్వతి అడిగింది కదా అని, ఆ అమ్మాయితో వున్న స్నేహంవల్ల, అతను తల్లిదండ్రుల్ని లక్ష్యపెట్టకుండా పార్వతిని చేసు కుంటాడే అనుకుందాం ...."

చంద్రశేఖర్ మధ్యలోనే అడ్డొచ్చాడు — "పెద్ద వాళ్ళని ధిక్కరించాడూ అంటే అతనికి అంతర్గతంగా ప్రేమ వున్నట్టే. ఆ ప్రేమ వుంటేనే పెద్దవాళ్ళని ధిక్క

రించే శక్తి వస్తుంది."

"అయితే దొరికారు. అతను పెద్ద వాళ్ళని ధిక్క రించలేదు కాబట్టి ఆ ప్రేమ లేనట్టేకదా?"

"ఉంది. అది అప్పటికి బయటపడలేదు, అంతే."

"అబ్బా! దేవదాసుని ఎంత వెనకేసుకొస్తున్నారో! పెద్దవాళ్ళని ధిక్కరించి పెళ్ళిచేసుకున్నా, అది, ప్రేమకి నిదర్శనం కాదండీ!.... అసలు దేవదాసు భావాలు ఏమీ ఎదగలేదనిపిస్తుంది నాకు. పార్వతిని పెళ్ళిచేసు కున్నా, తర్వాత జరిగే కష్టనష్టాలకు అతను నిలబడ లేడు. అతని తల్లిదండ్రులు పార్వతిని గౌరవించరు. పైగా కక్షకడతారు. గొప్పింటి బంధువులతో దేవదాసు ఇంటికి రాకపోకలుండవు. దేవదాసుకి హోదాలూ, మర్యాదలూ తగినట్టుగా జరగవు. క్రమంగా అతను పార్వతిని పెళ్ళిచేసుకోవడం అప్రతిష్ట పనిలాగే భావి స్తాడు. ఎప్పుడో ఏ కోపంలోనో ఏ తొందరలోనో తక్కువ ఇంటిదాన్ని పెళ్ళి చేసుకున్నాననీ, తన వాళ్ళందర్నీ ఒదులుకున్నాననీ, ఈసడిస్తూ ఉంటాడు. పార్వతి చాలా నొచ్చుకుని 'ఈ పెద్దింటి సంబంధం ఎందుకు చేసుకున్నాను దేవుడా' అని ఏడుస్తూ వుంటుంది. వాళ్ళ ప్రేమ సొగసు అలా పరిణమిస్తుంది చివరికి."

చంద్రశేఖర్ కోపంగా, ఆశ్చర్యంగా చూస్తున్నాడు. సుధ మాటల్లో ఒక్కటికూడా అతనికి నచ్చలేదు. కానీ వెంటనే ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఏం మాట్లాడరేం?" అని రెట్టించింది సుధ.

"ఏం మాట్లాడను? మీ అభూత కల్పనలన్నీ వింటున్నాను మతిపోయి. ఇలాగే రాశారా మీ వ్యాసంలో?"

"మహా చక్కగా రాశాను. మీరదంతా చదివితే గుండెలు బాదుకుంటారనుకుంటాను" అని నవ్వింది "దేవదాసు మహా చాదస్తుడండీ. పోనీ ఆ మాట మీ కిష్టం లేకపోతే, ఇంకో మాట అంటాను. పిరికివాడు. దేనికీ ఎదురు తిరగాలనే దృష్టేలేదు. పార్వతిని 'నాతో లేచి వస్తావా?' అంటాడే గానీ, పార్వతి నిజంగా వస్తానంటే ఈ ధీరుడు తీసుకు వెళ్తాడా?"

చంద్రశేఖర్, మొహం చిట్లించాడు. "అసలు పార్వతి వెళ్తుందా? ఆ పని ఎప్పుడు జరగాలో అప్పుడు జరగాలిగానీ, ఒకతన్ని పెళ్ళిచేసుకున్న తర్వాత, ఆ పని ఇప్పుడు చేస్తే దానికేం విలువ వుంటుంది?"

"ఒకప్పుడు ఇద్దరూ సరిగా అర్థం చేసుకోలేక పోయారనుకోండీ. వాళ్ళిద్దరూ ఇప్పుడెందుకు కలిసి బతకకూడదూ?"

"అలా కలవకూడదని కాదుగానీ .... ఆ సాంఘిక పరిస్తితుల్లో అది అతకదు."

"ఎందుకు అతకదూ? బాగానే అతుకుతుంది. దేవదాసు ఇంకో స్త్రీని ఇష్టపడలేకపోయాడు. పార్వతే తన జీవితానికి కావాలని స్పష్టంగా తెలిసిపోయింది, జీవితంలో ఇంకో లక్ష్యం, ఇంకో ఆదర్శం లేవు. తప్ప తాగి మురుగ్గుంటల్లో దొర్లుతోంటే అందరూ ఏమను కుంటారో పట్టించుకోలేదు. తన జీవితాన్నే అంత నిర్లక్ష్యంగా వొదిలేసుకున్న వాడికి సంఘ మర్యాదల మీద ఎందుకు గౌరవం వుండాలి? పార్వతిని తనతో వొచ్చెయ్యమని ఎందుకు ప్రార్థించలేదు? పోనీ దేవదాసు అలా ఎవరికోసం అయిపోయాడో పార్వతికి తెలుసుకదా? అతన్ని రక్షించి సంతోషపెట్టటం కన్నా పార్వతి జీవితానికి సార్థకత ఏముంది? 'మనం ఎక్కడికైనా వెళ్ళిపోయి బతుకుదాం' అని పార్వతైనా ఎందుకు అనలేదు? ఒకరికోసం ఒకరు ఏ త్యాగాలూ చేసుకోరు. మర్యాద ముసుగుల్లోంచి బయటపడరు. అయినా సరే గొప్ప ప్రేమికులని లోకం ఎందుకు కీర్తిస్తుందో నాకు అర్థంకాదు."

"నేల విడిచి సాముచేస్తే ఏదీ అర్థం కాదండీ! ఆ మనుషుల్ని ఆ సాంఘిక పరిస్తితుల్లోనే చూడాలి. ఇందాక నేనేదో వేదాంతం మాట్లాడానన్నారే! మీరి ప్పుడు, ఆ సంఘంతో సంబంధంలేని అలౌకికాలూ, త్యాగాలూ జరగలేదంటున్నారు. భూమిమీద వున్న పదార్థాలన్నీ భూమ్యాకర్షణకి అంటుకుపోయి వున్నట్టు, మనుషుల ప్రవర్తనలు సంఘ ప్రభావాలకు లోబడి పోయి వుంటాయి. ఆ గాడిలోపడి బతికే కోట్లమంది సామాన్యుల్లో దేవదాసు ఒకడు. వాళ్ళ కుటుంబానికి డబ్బు వుంటే వుండొచ్చు. అతని మనసుకి ప్రేమ తెలిసిందిగానీ, అది ఫలించేలాగ చేసుకోవడానికేం చెయ్యాలో, ఎవరికి ఎదురు తిరగాలో, అతనికి సరైన సమయంలో తెలీలేదు. దాని ఫలితం అతనే అనుభ వించాడు కదా? అసలు, రచయిత అదే చెప్పదల్చు కున్నాడు. పెద్దవాళ్ళు, ఆస్తుల రంధితోటీ, సాంప్ర

దాయాల రంధితోటీ, పిల్లల జీవితాల్ని ధ్వంసం చేసేస్తారని చెప్పాడు, కథలో! ...."

సుధ వింటూనే వుంది.

చంద్రశేఖర్ ఉత్సాహంగా సాగించాడు — "నా కర్థమైనంతవరకూ, రచయితలు రెండు రకాలుగా రాస్తారు. కొందరు — మనుషులెలా జీవించాలో చెప్తారు. కొందరు — ఎలా జీవించకూడదో చెప్తారు. శరత్ రాసిందంతా రెండో రకంలోనే. 'దేవదాసు' చదివి పూర్తి చేసిం తర్వాత మన మనసులు చాలా భారంగా అయిపోవూ? 'వాళ్ళిద్దరికీ పెళ్ళయితే ఎంత బాగుం డేది! పోనీ ఎక్కడికైనా పోయి సుఖంగా బతికినా బాగుండేది' అనిపించదూ? ఒక్కక్షణం అన్నా అలా అనిపించిందంటే, రచయిత మనకి చాలా నేర్పాడన్న మాట. ఏ రచనలో అయినా పాత్రలు చాలా విన యంగా బతికి, సంఘ నీతికి ఆహుతి అయ్యాయంటే, దాని వెనక సందేశం ఆ నీతిని ధిక్కరించీ, మార్చుకునీ, సుఖపడమనే! పార్వతికి పెళ్ళయింతర్వాత, దేవదాసూ, పార్వతీ కలకత్తా పోయి అక్కడ కాపరం పెడితే మనకి నిజంగా ఏమీ సానుభూతి కలగదేమో! 'వెధవ పని చేశారు. ఆ పనేదో మొదటే చేసి యేడవచ్చుకదా?' అనుకుంటామేమో! వాళ్ళ నాశనం మన కళ్ళారా చూస్తేనే సంఘ వికృత రూపం ఎలాంటిదో అర్థం అవుతుంది, ఏది తప్పో ఏది తప్పుకాదో అప్పుడు ఆలోచిస్తాం. అందుకే రచయిత ఇలా రాశాడు."

"హమ్మ! అయిందా ఉపన్యాసం? మీరు ఎంతైనా చెప్పండి. ఇద్దరు మనుషుల మనసుల్లో పుట్టిన ప్రేమ స్థిరంగా నిలబడాలంటే, ఆ ఇద్దరూ ముందు సంఘ ప్రభావాల్ని ఒదిలించుకోవాలి. దాంట్లో మునిగి తేలు తున్నంత కాలం ప్రేమ జీవితంలో చాలా అవాంతరా లొస్తాయి. సాధారణంగా అవే నెగ్గి ప్రేమ ఓడిపోతుంది. చచ్చిపోతుంది. దేవదాసూ, పార్వతీ విడిపోయి దూరం అయ్యారు కాబట్టే వాళ్ళ ప్రేమ అంత వృద్ధి అయింది గానీ వాళ్ళే పెళ్ళే చేసుకుని వుంటే మామూలు భార్యా భర్తల్లాగే కీచులాటల కాపురం చేసేవాళ్ళు."

"అయితే ప్రేమించుకున్న వాళ్ళు విడిపోతేనే వాళ్ళ ప్రేమ నిలుస్తుందన్నమాట!"

"చాలా మందికి అంతే. అందరికీ అంతేనేమో! అసలు ప్రేమ గురించి ఆలోచిస్తే నాకో కథ జ్ఞాపకం వొస్తుంది. ముసలి రాజుగారికి రాచపుండు లేస్తే వైద్యు లంతా చేరి దేవలోకం నుంచి ఏదో గొప్ప సువాసన పుష్పం తేవాలంటారు చూశారా? అదిగో ఆ పుష్పం లాంటిది ప్రేమ! దానికోసం ఎందరు బయల్దేరితే యేం? చివరికెవరో గొప్ప సాహసికుడూ సాహసికు రాలూ, — ప్రాణాలకు కూడా తెగించిన వాళ్ళు, దారి పొడుగునా కరుణతో ఎందరికో సహాయాలు చేస్తూ — తమ ప్రేమతో ఎందరికో శాపవిమోచనాలు కలి గిస్తూ, ధీరత్వంతో ఎన్నో ఘోర పరీక్షలకు తట్టు కుంటూ, దేవలోకం చేరతారు. దారి పొడుగునా చేసిన మంచి పనులవల్లే ఆ దేవపుష్పాన్ని తాకే అర్హత వొస్తుంది. అలాగే ప్రేమని పొందటానికికూడా అంత గొప్ప అర్హత కావాలి."

"సరే! జీవితం పొడుగునా ఏయే లక్షణాలు వుండాలో చెప్పండి, ఆ అర్హత కోసం."

వెన్నెల పూర్తిగా సుధమీంచి జరిగి చంద్రశేఖర్ మీదికి తిరిగింది.

జనం వొక్కొక్కరూ లేస్తున్నారు. సుధ వాచీ చూసింది. తొమ్మిది దాటింది. "ఏం చేద్దాం? సినిమాకి వెళ్దామా?" అంది.

"వొద్దండీ. సినిమాలాంటి అల్ప విషయాలకోసం పెద్దల మీద తిరగబడి కష్టాలు తెచ్చుకోడం వివేకం కాదు" అంటూ లేచాడు చంద్రశేఖర్.

"సింహం నోట్లో మట్టికొట్టి వెళ్ళిపోవాల్సిందేనా?" అంటూ సుధ కూడా లేచింది.

వెన్నెల్లో అంత దూరం చెట్లకిందనించి నడుస్తోంటే హాయిగా వుంది. ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. పార్కుగేటు దాటి రోడ్డుమీదికి జనంలోకి ఎలక్ట్రిక్ లైట్లకిందికి వొచ్చారు.

దారిలో చంద్రశేఖర్ చెప్పు కుట్టించుకున్నాడు. రూపాయిన్నర పెన్ను కొన్నాడు.

మళ్ళీ ఆ లెక్చరర్ సంగతి అడగాలని రెండు మూడుసార్లు అనుకున్నాడు గానీ అడగలేదు.

ఇంటికి చేరేసరికి పది దాటింది! సుధ తల్లి తలుపుతీసి — "భోంచెయ్యండి" అని గదిలోకి వెళ్ళి పోయింది. తండ్రి వీధి గదిలోనే సోఫా మీద పడుకుని వున్నాడు.

సుధ అన్నాలు పెట్టింది.

"చూశారా? పది దాటినా మీ అమ్మ గారేమీ అన లేదు. అనవసరంగా తల్లిదండ్రుల్ని ఆడిపోసుకున్నారు మీరు" అన్నాడు.

"పదకొండు దాటలేదు కాబట్టి" అంటూ సుధ కూడా కూర్చుంది.

చంద్రశేఖర్ మాట్లాడించినా, సుధ మాట్లాడే పద్ధతిలో కనపళ్ళేదు. ఎంచేతనో సుధ ఇంట్లో వున్నప్పుడు ఎక్కువ మాట్లాడదేమో అనిపించిందతనికి.

'అమ్మ ఇంకా అలాగే వుంది' అనుకుంది సుధ. చాలా దిగులు కలిగింది.

నాన్న బయట గదిలో పడుకున్నాడంటే ఇంకా అలాగే వున్నాడన్న మాట. ఆయనకి కోపం వొచ్చినప్పుడు చేసే పని అది.

చంద్రశేఖర్ భోజనం ముగించి లేస్తూ "మీ దేవదాసు వ్యాసం వొకసారివ్వండి" అన్నాడు.

సుధ కొంచెం సేపటికి తలెత్తి చూసి — "అంత బాగుండదు. ఏదో రాశాను. చాలా మార్చాలి" అంది నిరుత్సాహంగా నవ్వుతూ.

"ఫర్వాలేదు" అన్నాడు.

సుధ లేచి వెళ్ళి పుస్తకాల అలమారులోంచి ఒక నోట్‌బుక్ తీసి ఇచ్చి వెళ్ళిపోయింది.

అట్టమీద ఎగిరే పక్షులు చాలా ముద్దుగా వున్నాయి. చాలాసేపు వాటినే చూసి అట్ట తిప్పాడు. అది రాసిన తారీఖు చూస్తే సంవత్సరం పైగానే అయింది!

"పార్వతికీ. దేవదాసుకీ పెళ్ళయితే వారి జీవితం ఎలా వుండేది?" అని హెడ్డింగు. 'దేవదాసు' నవల చదివినప్పుడు సుధ చాలా చలించిపోయి వుండాలి. లేకపోతే అంత పట్టుదలగా, అంత ఆసక్తిగా, అన్ని పేజీలు రాసివుండదు. దేవదాసుమీద సుధకి చాలా కోపంగా వున్నట్టు కనపడింది. అతను చిన్నప్పుడు చేసిన అల్లరినికూడా తెగ విసుక్కుంది. అతని వెనకాల తిరిగిన పార్వతికి బుద్ధి లేదంది. చదువుకున్నా, పెద్దవాడైనా, దేవదాసుకి జ్ఞానం రాలేదంది. తలకాయలో సరుకులేని వాళ్ళు కలకత్తా వెళ్ళినా, లండన్ వెళ్ళినా వొక్కటేనంది.

చంద్రముఖిని దేవలోకాని కెత్తింది. దేవదాసు వెంట వుండే ముసలి నౌకర్నికూడా చంద్రముఖి సరసనపెట్టి 'అసలు ప్రేమ అంటే వీరిదే. ఆ మూర్ఖుడికి ఎంతమందినుంచి ప్రేమ దొరికితే ఏం లాభం? కాలదన్నుకు పోయాడు' అని మళ్ళీ దేవదాసునే తిట్టింది.

పార్వతి గురించి చాలా ప్రేమగా రాసింది. పార్వతి ఆత్మాభిమానానికి, నివాళులెత్తింది. ఎక్కడికక్కడ పార్వతి సాహసానికి అదిరిపడింది. స్నేహితురాల్ని వెక్కిరిస్తూ పార్వతి — 'ఎందుకే మీరు అనవసరంగా గుప్పెళ్ళకొద్దీ పసుపూ కుంకాలు పాడుచేస్తారూ? ఎవర్ని భర్త అనాలో నీకు తెలుసునా? నాకు ముసలి జమీందారుతో పెళ్ళి అయితే యేం? పెళ్ళిళ్ళు తంతు ప్రకారం అవుతాయి. నా అసలు భర్త మాత్రం దేవదాసే' అన్నదని తెగ ప్రశంసించింది — 'చూడు దౌర్భాగ్యుడా! అలాంటి ప్రియురాలిని — అలాంటి అర్ధాంగిని — అలాంటి జీవన సహచరిని, నీ మూర్ఖత్వంతో శాశ్వతంగా పోగొట్టుకున్నావు. నీ రాక్షస తల్లిదండ్రుల్నీ, నీ బూజుపట్టిన వంశం గొప్పనీ, నీ జమీందారీ బరువునీ వేలంవేస్తే మాత్రం పార్వతిని కొనగలవా?' అని మళ్ళీ దేవదాసునే తిట్టింది.

అన్ని తిట్లుతిన్న దౌర్భాగ్యుడి మీద సుధకికూడా చాలా జాలి కలిగింది చివరికి. 'పిచ్చివాడా! ఒక జన్మ దూరం పెద్దదూరం కాదులే. వొచ్చే జన్మలో నువ్వు పార్వతి చేతుల్లో పడాలని నీకోసం నేనుకూడా ప్రార్థిస్తున్నాను' అని వ్యాసం ముగించింది.

ప్రాణాలు బిగబట్టి వింటోన్న శరత్‌బాబు సుధ తీర్పుకి తేలిగ్గా నిట్టూర్చి వుంటాడు!

కానీ, సుధ మర్చిపోయింది. దేవదాసు, వచ్చే జన్మకి, చంద్రముఖికి వాగ్దానం చేశాడు. ఆ సంగతి జ్ఞాపకం వొస్తే సుధ మళ్ళీ 'చూశారా? అన్నీ ఇలాంటి పనులే చేస్తాడు. దరిద్రుడు' అని మళ్ళీ తిడుతుంది దేవదాసుని. పాపం ఇప్పటికే చాలా తిట్లు తిన్నాడు.

ఆ వ్యాసం మొదట్లో చంద్రశేఖర్ గబగబా రాశాడు. "ఒక్క అక్షరం కూడా మార్చకండి. చక్కగా రాశారు. ఎవ్వరైనా దీనితో ఏకీభవించవలసిందే."

నోట్‌బుక్ టేబుల్‌మీదపెట్టి లైటార్పి పడుకున్నాడు. అతని ఆలోచనలన్నీ సుధచుట్టూనే తిరిగాయి నిద్రలోకి జారిపోయేదాకా.

సుధ పెరటివేపు మెట్లమీద కూర్చుని తల్లితో

మాట్లాడాలని ప్రయత్నిస్తోంది. పద్మావతి ముభావంగా వున్నట్టు కనపడాలని పుస్తకం చదువుకుంటోంది.

"వెళ్ళి పడుకోరాదూ?" అంది ఆవిడ కొంత సేపటికి.

"నిద్ర రావటం లేదు. నువ్వింకా చదువు కుంటావా అమ్మా?"

"ఈ పుస్తకం ఇచ్చెయ్యాలి రేపు."

"అసలేమైందమ్మా సాయంత్రం?"

ఆవిడ విని వూరుకుంది.

"నాన్న ఈ పూటకూడా అన్నం తినలేదా?"

రెండు ప్రశ్నలకీ ఆవిడ మాట్లాడలేదు.

సుధకి మళ్ళీ పలకరించే ఉద్దేశం లేదు. అలాగే కూర్చుంది.

"కొత్తగా ఏమౌతుంది? ఎప్పుడూ వున్నదే" అంది తల్లి నిష్ఠూరంగా.

"అదికాదు, అసలేమైంది?"

"ఈయన ఎందుకిలా తయారవుతున్నారో, నాకు మతిపోతోంది. నిజంగా పోనీ నేను చేసింది ఎంత అప రాధమో నువ్వే చెప్పు. శర్మగారికి ఆమధ్య చాలా జబ్బు చేసిందికదా? పాపం బోలెడు ఇబ్బందుల్లో వున్నాడు. చచ్చిపోతున్నాడన్న మనిషి ఎలాగో బతికి బట్టకట్టి మనుషుల మొహాలు చూస్తున్నాడు. ఇంటినిండా పిల్లా జల్లా ఎన్ని ఖర్చులుంటాయో చూడు. కొంచెం డబ్బు అప్పుడిగాడు. అలాంటి పరిస్థితుల్లో అడిగితే ఎలా కాదంటాం? మనిషి చాలా మంచివాడు. రేపోమాపో ఎరియర్సు వొస్తాయి అందరికీ. ఆయనే తీర్చేస్తాడని జీతంలోంచి ఆయన కిచ్చాను. దానికీ ఇంత రాద్ధాంతం! 'ఎగ్గొడితే ఏం చేస్తావు?' అంటారేమిటి సుధా? కిందటి నెల్లో శారద గారికిస్తే ఆవిడ వారం రోజుల్లో ఇచ్చెయ్యలేదూ? 'అస్తమానూ అందరికీ అప్పు లివ్వటం కుదరదు' అని నాతో తగువు, ఆఫీసునించి రాగానే. సాటి మనుషుల్తో ఆ మాత్రం కష్టం సుఖం లేకుండా ఎలా వుంటాం సుధా? నేను సంపాదించాలే గానీ స్వతంత్రించి ఏమీ చెయ్యగూడదా? ఆ మాటంటే ఇంతెత్తున లేచి .... అబ్బ! ఏం మనిషో!" అంటూ కంఠం ఆగిపోయి ఏడ్చేసింది తల్లి.

సుధ మనసు విలవిల్లాడింది. 'ఛీ ఛీ! నాన్న ఇంత అల్పుడా? భార్యమీద ఇంత పెత్తనమా? అబ్బా....'

కన్నబిడ్డకి తన కష్టం చెప్పుకుని తల్లి ఏడు స్తోందంటే తల్లికి ఇంత పిరికితనమా! భరించలేక తలవొంచుకుని మోకాళ్ళమీద ఆన్చుకుని కూర్చుంది.

అమ్మ ఎంతో మంచిపని చేసింది. ఎంత దయ గానో చేసింది. అసలు ఎందుకు చేసిందో తెలుసుకుని "అలాగా? దానికేముంది పద్మా?" అంటే నాన్న? నాన్నకూడా అంత కిరాతకుడేంకాడు. ఆ పరిస్థితుల్లో తనుకూడా అలాగే చేస్తాడు. తను మాత్రం తన స్నేహితులికి అప్పులివ్వటం లేదూ? వాళ్ళ దగ్గిర్నించి తీసుకోడం లేదూ? అలాంటి లావాదేవీలన్నీ తనే చెయ్యాలి. భార్యకి స్నేహితులుండకూడదు. స్వంత వ్యవహారా లుండకూడదు.

శర్మగారికి అప్పు ఇవ్వటం — మానటం అమ్మ ఇష్టం. ఎవరిష్టప్రకారం వాళ్ళకి చేసే హక్కుంది. ఒద్దనీ కాదనీ చెప్పటానికి నాన్న ఎవడు?

"ఈయన రోటరీ క్లబ్బు కాదుగానీ .... ముందు నా ప్రాణాలు పోతున్నాయి. డబ్బు రంధి ఎక్కువై పోయింది. గబగబా డబ్బు పోగుచేసి కారుకొనాలట — కారు!"

అవును. నాన్నకి రొటేరియన్ అయ్యాకే మరీ ఆడంబరాల పిచ్చి ఎక్కువైపోయింది. బోలెడు ఖరీదులు పెట్టి కొత్త సూట్లు కుట్టించాడు. కొత్త ఫర్నిచర్ తెచ్చాడు. ఫోను పెట్టించాడు. ఇక కారు కొనాలని విశ్వప్రయత్నం. అప్పటికిగానీ హోదా పూర్తికాదు. పోనీ డబ్బుంటే కొనుక్కోవచ్చు. విలాసాలు మానేసుకుని దేశంకోసం, పేదలకోసం, త్యాగాలు చెయ్యమని ఈయన్ని ఎవ్వరూ శాసించటం లేదు. భార్యకోసమైనా కొంత సహనం అక్కర్లేదా? తిట్టి, దండించి, పెత్తనం చేసి, డబ్బు కూడబెట్టి, కారుకొని, అందులో తిరిగితే ఏం గొప్ప సుఖం వస్తుంది?

"రేపు శర్మగారికి చెప్పేస్తాను. ఎక్కడన్నా చూసి నా డబ్బు నాకు సర్దెయ్యండి బాబూ! ప్రాణాల మీదకొచ్చి పడింది — అని ఏదో అబద్ధం చెప్పి ఆ డబ్బు తెచ్చి ఈయన మొహాన్న పారేస్తేగానీ ...."

సుధ చటుక్కున తలఎత్తి — "ఛీ ఛీ! అలా మాత్రం చెయ్యకమ్మా!" అని మొహం చిట్లించింది.

"మరి ఏం చెయ్యమంటావు?"

"ఏమీ చెయ్యక్కర్లేదు. శర్మగారు ఎప్పుడిస్తే

అప్పుడే తీసుకో. ఇవ్వకపోతే వూరుకో. ఆ మధ్య స్మగుల్డ్ టేప్ రికార్డర్ తెస్తానని ఎవరో ఆకాయన వెయ్యి రూపాయలు ఎగ్గొడితే నాన్నేం చేశాడు?"

"బాగుంది. అది ఆయన చేసిన పని. నేను చేస్తే వూరుకుంటారా?"

"ఏం చేస్తాడు వూరుకోక? ఏం చేస్తాడమ్మా? అలిగిపడుకుంటాడు. పడుకోనియ్యి. లక్ష్యపెట్టకు. పలకరించకు."

"ఎన్నాళ్ళీ గొడవ ఇంట్లో?"

"ఎన్నాళ్ళేమిటి? ఎవరి మూర్ఖత్వం వాళ్ళకి తెలిసే దాకానూ! అసలు ఇలాంటి విషయాల్లో నువ్వెందుకు పట్టుదలగా వుండవో నా కర్థంకాదు. అందుకే నాకు విసుగ్గా వుంటుంది నీ మీద. స్వేచ్ఛకోసం చేసే యుద్ధాలు దేశాలకైతే ఏళ్ళ తరబడీ, యుగాల తరబడీ సాగుతాయి.

ఒక మనిషి, తన దారి సరిజేసుకోడానికి ఇంత కాలమా? ఈ తప్పంతా నీదే!"

కూతురు అలా అంటుందనే కూతురికి ఏం చెప్పాలన్నా తల్లికి భయం!

"ఛీ ఛీ! వెధవ బతుకైపోయింది" అని నిట్టూర్చింది పద్మావతి. సుధకి తండ్రిమీద బాగా కోపం వచ్చిందని ఆవిడకి అర్థమైంది. తీరా కడుపులో బాధంతా చెప్పి ఆ పిల్లతో సలహా చెప్పించుకున్నాక కొంచెం చిన్నతనం అనిపించింది పద్మావతికి — "ఏం స్వేచ్ఛా .... ఏం యుద్ధం! పిచ్చిమాటలు. సంసారాలు వెలగబెట్టే వాళ్ళకి బుద్ధీ జ్ఞానం వుండాలిగానీ .... ఈయన రోజూ పోట్లాడుతూ వుంటే ఎవరు పడగలరు?.... రేపు కాక పోయినా, రెండు రోజులు పోయాకన్నా అడగాలి శర్మగార్ని" అనుకుంటూ పుస్తకం మూసి — "పద పడుకుందాం" అంటూ లేచింది.

తల్లిలో సుధకి నచ్చనిది అదే. బాధ పడడంతో సరిపెడుతుంది. గట్టిగా ఎదురు తిరగదు. లేకపోతే నాన్న ఎప్పుడో దారికొచ్చేవాడు. రాకపోతే పోయేవాడు.

"అమ్మా! నాన్నని నేనడుగుతాను."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? ఎలా చేస్తే అలా వూరుకోడ మేనా? నీ మీద నాన్న పెత్తనం ఏమిటి? అసహ్యం వేస్తోంది. అసలు నువ్వు ఇచ్చిన లోకువే ఇదంతా."

"బుద్ధిలేని మనుషుల్తో ఏం చేస్తామే సుధా?"

"ఏం చేస్తామా? బుద్ధి తెప్పిస్తాం."

"ఆఁ, తెప్పిస్తాం. మన చేతుల్లో పనా?"

"నీ చేతుల్లో పని కాకపోతే ఎవరిచేతుల్లో పనమ్మా? ఇంత పెత్తనం నువ్వెందుకు భరిస్తావు? ఇటో అటో తేల్చేసుకో ఇవ్వాళ!"

"చాల్లే, పరువు తక్కువ! ఇంట్లో ఆ అబ్బాయి కూడా వున్నాడు. ఇప్పుడేం గొడవ పెట్టుకుంటాం? రేపు శర్మగార్ని అడిగి తెచ్చి పడేస్తాను."

అబ్బా! వీళ్ళనెవరు మార్చగలరు?

నాన్నని ఎలా అడగాలో అలా అడగరాదూ? "నువ్వు చేసే పనులన్నీ నువ్వు చెయ్యడం లేదా? నేను ఆఫీసులో తోటి ఉద్యోగికి అప్పిస్తే దానిమీద నన్ను ప్రశ్నించడమా? ఇంకెప్పుడైనా ఇలా మాట్లాడావంటే నీకూ నాకూ తెగతెంపులే" అనరాదూ?

అలా అనదు. అది శరీరం కాదు. అందులో చీమూ నెత్తురూ లేవు.

అది సరే, ఆయనకి గట్టిగా చెప్పేస్తుందను కుందాం. వార్నింగ్ ఇస్తుంది. విడిపోతుంది. అదికాదు ప్రశ్న! ఏమైంది ఆ 'ప్రేమ'? ఎలా చచ్చింది అది? అది, ఈ నీచత్వం నించి రక్షించదా? అలాగైతే దాని గొప్పేమిటి? అది వున్నదానికీ లేనిదానికీ తేడా ఏమిటి? అది ఒకప్పుడు ఉండేదా? ఇప్పుడు లేదా? అది కొంతకాలానికి పోతుందా?

సుధ, చంద్రశేఖర్ పడుకున్న గదిలోకి వెళ్ళింది. అతను నిద్రపోతున్నాడు. చొక్కా మార్చుకోలేదు. కొత్త పెన్ను జేబులోంచి తొంగిచూస్తూ చీకట్లో మెరుస్తోంది. అది తీసి టేబుల్‌మీదపెట్టి ఫేన్‌వేసి వెళ్ళిపోయింది.

సుధకి నిద్ర పట్టటంలేదు. తల్లి చెంపలమీద జారే కన్నీళ్ళు లేత వెలుగులో, ధగధగా మెరుస్తున్నాయి.

"ఛీ ఛీ! ఏం జీవితం?" అని ఎవరన్నా ఏడ్చారంటే, వాళ్ళకి అంత దుఃఖం కలిగించిన వాళ్ళని ఏం చెయ్యాలి?

"ఏమి జన్మం బేమి జీవనమూ ...." అంటూ పుట్టి నందుకు సిగ్గుపడుతూ .... పాడుతూ అడుక్కుంటూ .... రోజూ వొస్తాడొక బిచ్చగాడు. అతనికి అంత కష్టం కలిగించేది ఎవరో చెప్పమంటే? మామూలే. "నా కర్మ

తల్లీ!" అంటాడు. అమ్మా నాన్నాకూడా ఎవరి కర్మకి వాళ్ళు వగస్తూ వుంటారు. ఒకప్పుడు 'అదృష్టం' అనుకున్నదంతా కర్మలోకి దిగిపోయింది.

రోడ్డువార కుళ్ళు కాలవ వొడ్డున చింకి పీలికలతో శవాకారంగా వున్న కురూపి బిచ్చగాణ్ణి చూపించి — "ఇరవై సంవత్సరాల కిందట ఇతడు గొప్ప రాజాధి రాజు. ప్రపంచాధినేత. సౌందర్య ప్రభువు. సువర్ణ రథాలలో పయనించిన వాడు. హంసతూలికా తల్పా లపై శయనించిన వాడు" — అంటే, నమ్మశక్యంగా వుంటుందా?

"అరె! ఇప్పుడిలా అయ్యాడేం?"

"అయిపోయాడు."

"ఎందుకయిపోయాడు? ఆ రాజ్యాలూ, ఆ సిరి సంపదలూ, ఆ సౌందర్యాలూ అన్నీ ఏమైపోయాయి?"

"పోయాయి."

"ఎలా పోయాయి?"

"ఎలాగో పోయాయి."

ఎలా నమ్ముతాం? .... అదే నిజం అయితే నమ్మకేంచేస్తాం? — అయినా అవన్నీ భౌతిక సంప దలు, పోతే పోవచ్చును. ఈ ఆత్మసంపద .... అనురాగ సంపదకూడా పోతే, మనుషులకేం మిగుల్తుంది? అసలు చెక్కు చెదరకుండా మిగిలేది ఏమిటి? ఏమీ ఉండదా?

ఆ బిచ్చగాళ్ళకన్నా దురదృష్టవంతులు అయి పోయారు అమ్మా నాన్నా! ఆ ప్రేమ రాజ్యాలన్నీ ఏం చేసుకున్నారో! ఆ సంతోషాలన్నీ, జీవితం మీద ఆ ఆశలన్నీ ఎలా పోగొట్టుకున్నారో ....! ఆ కొత్త రోజుల్లో — ఈ ప్రపంచాన్నే ధిక్కరించిన ధీరుల్లాగ, రెక్కలు చాచుకుని ఎగిరే పక్షుల్లాగ .... ఆకాశంలో విహరించే మబ్బుల్లాగ — ఆ మొహాల్లో — ఆ కళ్ళల్లో ఎంత మెరుపు! ఎంత కాంతి! ఎంత ఆనందం! — ఎంతెంతో అందమైన ఉద్యానవనాల్లో — నదీతీరాల్లో — పడవ షికార్లలో — ఉన్నత సౌధాలముందు — సూర్యాస్తమ యాల్లో — ఎన్నెన్ని రకాల ఫోటోలు! నెమలి సింహా సనం మీద రాణిలాగ కూర్చున్న అమ్మ — అప్పుడు నిజంగా ఒక ప్రేమ సామ్రాజ్యానికి రాణియే. నాన్న మొహం ఎప్పుడూ చిరునవ్వుతో వెలిగిపోతూ వుంటుంది — ఆ ఫోటోల్లో! ఆ మధుర స్మృతులన్నీ కాయితాల మీద ఒదిగి దాక్కున్నాయి. మళ్ళీ మళ్ళీ కొత్త ఫోటోలు లేనేలేవు.

అమ్మకి ఇష్టమైన వాళ్ళెవరన్నా వొస్తే ఆ ఆల్బమ్స్ తీసి చూపిస్తూ వుంటుంది. చూసేవాళ్ళ కళ్ళలో అసూయ జాడలు సృష్టించేంత అద్భుతంగా వుంటాయి ఆ ఫోటోలు. 'ఇవన్నీ మీ పెళ్ళిరోజులల్లో వేగా? తర్వాతవేం లేవేం?' అని ఎవ్వరూ అడగరు. ఒకరో ఇద్దరో అడిగితే, 'ఏవిటోనండీ, శ్రద్ధ పోయింది' అంటుంది అమ్మ. 'ఏవిటోనండీ ప్రేమ పోయింది' అనెయ్యరాదూ?

ప్రేమలు తప్పకుండా పోతాయి. అలా పోయి నప్పుడు భరించటం ఎలాగ? భరించలేని వాళ్ళు దాన్నెందుకు పోగొట్టుకుంటారు? ప్రేమపోతే బతకలేని వాళ్ళు దాన్నెందుకలా చింపిరి చింపిరిగా చేసు కుంటారు? అసలు ఎంత కాపాడుకున్నా అది నిల బడదా? హారతి కర్పూరం హరించిపోయినట్టు ప్రేమ అంతా హరించిపోయి, చివరికి ఆడా మగా పెత్త నాలూ, కులాలూ, రోటరీ క్లబ్బులూ డబ్బులూ కార్లూ ... ఇవే పాలిస్తాయా జీవితాల్ని? అయితే ఇక ప్రేమా గీమా ఎందుకూ, పిచ్చి! అందుకే మొదటినించే దానిమీద ఆశపెట్టుకోకూడదు. ఈసారి రాజారావు గారికి నిర్మొహమాటంగా చెప్పెయ్యాలి — "చూడండి సార్! ఈ ప్రేమలూ అవీ చిన్నపిల్లలు ఆడుకునే రబ్బరు బుడగల్లాంటివి. వాటి రంగులుచూసి మురిసిపోతారే గానీ, వాటినెంత మృదువుగా ఎంత జాగ్రత్తగా రక్షించు కోవాలో పిల్లలకు తెలీదు. తెలిసినా లాభంలేదు. ఎప్పుడో అప్పుడు అవి పేలి తీరాల్సిందే. పేలడం బుడ గల ధర్మం. పేలగొట్టడం పిల్లల ధర్మం. పిల్లలకన్నా మనం ఏమీ జ్ఞానులంకాము. వాళ్ళ ఆట — బుడగల కన్నా మన ప్రేమలు దృఢమైనవీ కావు. 'మీకూ — మీ పెళ్ళికీ నమస్కారం' అని చెప్పెయ్యాలి!

★ ★ ★

తెల్లారిందగ్గర్నించీ సుధ తండ్రి వెంకట్రావు కొంచెం నవ్వు మొహంతో కనిపించాడు అందరికీ. చంద్రశేఖర్‌కి, ఉద్యోగం గురించి ఎవర్నో కలుసు కోమని వివరాలన్నీ చెప్పాడు. ఎవరూ పిలవకుండానే టిఫిన్‌కోసం వచ్చి పేపరు చదువుతూ టేబుల్ దగ్గిర

కూర్చున్నాడు.

సుధ చంద్రశేఖర్‌ని కూడా పిలిచి ఇద్దరికీ ఇడ్లీలుపెట్టి తనుకూడా కూర్చుంది నాన్నని కడుపులో మిషను కేకలేసి పంపింది కావున్ను. అప్పుడప్పుడూ అలగటం మంచిదే. ఆకలన్నా తెలుస్తుంది. అసలు అలిగి తిండి మానేసిన వాళ్ళకి పది రోజులదాకా ఏమీ వండకూడదు.

"ఆ కారప్పొడి ఇలా ఇయ్యమ్మా!"

సుధ ఆ పని చేసింది.

ఇడ్లీలనిండా నెయ్యిపట్టిస్తూ "ఏమ్మా! నిన్న సుందర్రావు గారు కారెక్కమంటే యెక్కనన్నావట?" అని జవాబు చెప్పమన్నట్టు చూశాడాయన కూతుర్ని.

సుధకి నిన్న సంగతి జ్ఞాపకం ఒచ్చి "సుందర్రావు గారో, మందర్రావుగారో ఆయ నెవరో నాకు తెలీదు" అంది.

"నన్నెరుగుదునని చెప్పారటగా?"

"నిన్నెరిగితే? — నిన్నెరిగిన వాళ్ళందరి కారులూ ఎక్కమంటావా నన్ను?" అని కోపం తెచ్చుకుంది కుమార్తె.

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"అబ్బ! అదికాదమ్మా! వానలో అంత తడిసి రాకపోతే పెద్దాయన కార్లో డ్రాప్ చేస్తానంటే ...."

"ఊరుకో నాన్నా! నీకు మరీ కార్ల పిచ్చి ఎక్కువవుతోంది. నా కిష్టంలేదన్నాక ఆయన నోరు మూసుకోవాలి. నీకు చెప్పటం ఏమిటి? నువ్వు నన్ను అడగడం ఏవిటి? సిల్లీ! — నువ్వూ కారు కొంటావు కావున్ను. — నీ కార్లో కూడా నన్నెప్పుడూ ఎక్కమని అడక్కు!"

"ఓహో! నీ కారు నువ్వే కొనుక్కుంటావా?"

"ఏం, కొనుక్కోలేనా? నీపాటి ఉద్యోగం నేనూ చేస్తాను."

"చాలా పెద్ద దానివయిపోయా వన్నమాట!"

"పెద్దవాళ్ళు చిన్నవాళ్ళవుతోంటే, చిన్నవాళ్ళు పెద్దవాళ్ళు గాక ఏం చేస్తారు?"

కూతురు జవాబు లెప్పుడూ ఆయనకి అలవాటే. మురిపెంగానే వున్నాయి. పైకిమాత్రం కోపం ప్రదర్శిస్తూ చంద్రశేఖర్‌ని చూసి — "చూడవోయ్! మా అమ్మాయి తీరు. నువ్వెప్పుడన్నా పెద్ద వాళ్ళకి ఇలా ఎదురు తిరిగి మాట్లాడావా? పిల్లల్ని కనీ, పెంచీ పెద్దవాళ్ళని చేసేది ఇందుకేనా? ఆ మాత్రం విశ్వాసం వుండొద్దూ?" అని ఫిర్యాదు చేశాడు.

చంద్రశేఖర్ నవ్వి వూరుకున్నాడు.

"విశ్వాసం కుక్కల లక్షణం అని చెప్పరేం మీరు?" అని సుధ శేఖర్‌ని కోపంగా చూసింది.

"నీ కీ తలతిక్క పోవాలి సుమా!" అన్నాడు తండ్రి. కొంచెం అవమానపడి నవ్వుతూనే.

"థాంక్స్ నాన్నా! తల తిక్క పోగొట్టుకోడానికి పర్మిషన్ ఇచ్చావు."

వంటింట్లోంచి కూతురు మాటలన్నీ వింటోన్న పద్మావతి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటోంది.

చంద్రశేఖర్ మాత్రం పూర్తిగా ఆశ్చర్యంలో మునిగాడు.

★ ★ ★

"మనుషుల సంస్కారంలో తప్ప నాకు ప్రేమలో నమ్మకం లేదు మాష్టారూ!" అంది సుధ కొంచెం మొహమాటపడుతూ, రాజారావుతో.

"అంటే?" అన్నాడు మేష్టారు అర్థంకానట్టు. అర్థం కాలేదు కూడా. ఇద్దరూ చిట్టడవి పార్కుకే వచ్చారు. అతను "మాట్టాడాలి" అన్నాడు మళ్ళీ సాయంత్రం.

'పెళ్ళి' గురించీ, 'ప్రేమ' గురించీ ఏమీ ఆలోచించకూడదని సుధ చాలాసార్లు నిర్ణయాలు చేసుకుంది. ముందు చదువు! తర్వాత ఏదో విధంగా బ్రతుకు తెరువు! ఆ తర్వాత — ఏమో! 'అంతవరకూ జరగాలి ముందు' — అనుకుంటూ వుంటుంది.

రాజారావు సుధ విషయంలో ఎక్కువ ఆసక్తి చూపిస్తోంటే, సుధ తన నిర్ణయానికే వ్యతిరేకంగా మళ్ళీ ఆలోచనల్లో పడింది.

"మీ రన్నదేమిటో నాకు అర్థం కాలేదు" అన్నాడు రాజారావు.

ఈ మేష్టారు, స్టూడెంట్స్‌ని ఒక్కోసారి 'నువ్వు' అంటాడు. ఒక్కోసారి 'మీరు' అంటాడు.

సుధ కొంత ఆలోచనలోంచి బయటపడింది. "ఏదో అన్నాను గానీ, నాకూ అర్థం కావటంలేదు మాష్టారూ! .... కొందర్ని చూశాను. ప్రేమించి, పెళ్ళి చేసుకున్న వాళ్ళయినా చాలా మామూలు భార్యా

భర్తల్లాగే బతుకుతూ వుంటారు. మామూలు కుటుంబాల్లో వుండే అన్ని సాంప్రదాయాలూ పాటిస్తారు. అలాంటి పెత్తనాలే. అలాంటి బానిసత్వాలే! అన్నీ అలాంటివే! మా బంధువుల్లో ఒకబ్బాయి తల్లి కిష్టంలేకపోయినా ఎదిరించి పెళ్ళి చేసుకున్నాడండీ. ఈ పిల్లని తీసికెళ్ళి మళ్ళీ తల్లి పెత్తనం కిందే పెట్టాడు. ఆవిడకి కోడలిమీద చాలా కక్షగా వుంది. కట్నాలూ, కానుకలూ లేకుండా కొడుకుని వల్లో వేసుకుందని. కోడలికి ఇంట్లో బండచాకిరీ తప్ప దేనికీ చోటులేకుండా చేసింది. కొడుకు మాతృదేవి ముద్దుచేష్టలన్నీ చూస్తూ వూరుకున్నాడు. పైగా ఓర్చుకోమని గీతా బోధ చేశాడు భార్యకి. ఇప్పటికీ ఆ సంసారం అలాగే ఏడుస్తోంది" అంది సుధ గబగబా

కుర్ర మేష్టారు శ్రద్ధగానే విన్నాడు. ఏమీ మాట్లాడలేదు! సరిగ్గా అతని పరిస్థితీ అలాంటిదే. తల్లికి కట్నాల ఆశ చాలా ఎక్కువ. కులం పిచ్చి ఇంకా ఎక్కువ. ఇతనికా ఉద్దేశాలు లేవు. సుధని చేసుకోవాలంటే అతని తల్లి వొప్పుకుంటుందనే నమ్మకం లేదు. పెళ్ళి వరకూ ఎలాగో ఆవిణ్ణి ఒప్పించినా తర్వాత పరిస్థితి కొంతన్నా సుధ వర్ణించినట్టే వుంటుంది.

"చెప్పాలంటే, మా అమ్మగారి సంగతికూడా అలాంటిదే. ఆవిడికి కులాల నమ్మకాలు జాస్తీ!"

"కట్నాల నమ్మకాలు?"

"చెప్పాలా? దాని మీదా ఆశే."

"మరి ...."

"నా అభిప్రాయాలు ఆవిడికి తెలుసు. అయినా, ఆవిడ అభిప్రాయాలు నేనెలా మార్చగలను? .... ఎంతైనా పెద్దవాళ్ళుకదా? 'వాళ్ళు అంతే' అని కొన్నాళ్ళు వూరుకుంటే అదే సర్దుకుంటుంది."

"చాలా చోట్ల సర్దుకోదండీ! ఇందాక నేను చెప్పిన కోడలు ఆ మధ్యెప్పుడో ఆత్మహత్యా ప్రయత్నం చేసిందన్నారు. అదే ప్రయత్నం ఇంకోసారి చెయ్యదా? అప్పుడు నిజంగానే స.... ర్దు.... కుంటుంది సంసారం!"

"నన్ను అపార్థం చేసుకుంటున్నట్టున్నావు సుధా!"

"అయ్యయ్యో! అదేం లేదు మాష్టారూ!...."

"నేను చాదస్తంగా మాట్లాడుతున్నాననుకోకు. పెద్ద వాళ్ళదగ్గిర కొంత ఓపిగ్గానే వుండాలి"

"ఇంక వెళ్దామా?" అని లేచి నిలబడదామనిపించింది సుధకి.

రాజారావు మీద సుధకి దురభిప్రాయం లేదు. ఆయన మంచి లెక్చరరు. స్నేహ పాత్రుడు. తనకి తెలిసిన పాటి అల్పవిషయాలు ఆయనకి తెలీవని అనుకోకూడదు! అయినా చంద్రశేఖర్‌తో వాదించినట్టు ఈయనతో మాట్లాడాలనిపించడం లేదు.

"సుధా! మీ సందేహ లేమిటో నాకు అర్థం కావటంలేదు" అన్నాడు రాజారావు నిరుత్సాహంగా. అతను సుధకి తన మనసులో ఆలోచనలు చెప్పాలనుకున్నాడు. సుధ మొదట్లోనే 'నాకీ ప్రేమల్లో నమ్మకం లేదు మాష్టారూ!' అనటంతో పరిస్థితంతా తారుమారైంది.

"ప్రేమలో నమ్మకం వుండటం ఏమిటి, లేకపోవటం ఏమిటి?" అన్నాడు ఆ సంగతే గుర్తొచ్చి.

"ప్రేమ — అనేది, కొన్నాళ్ళు వుండి తర్వాత పోయే చిన్న ఆకర్షణ అనిపిస్తుంది మాష్టారూ నాకు. పెళ్ళయిపోతే వాళ్ళూ మామూలుగా అయిపోతారు .... ప్రేమ లక్షణాలే మిగలవు."

"పెళ్ళయ్యాక కూడా పెళ్ళికి ముందు వున్నట్టే ఎలా వుంటారు?"

సుధ నవ్వింది. "ఏం, ఎందుకు వుండకూడదు?"

"మార్పులు రావా?"

"అదే! ఆ మార్పు గురించి ఆలోచిస్తేనే ఆశ్చర్యంగా అనిపిస్తుంది."

"......................."

"మాష్టారూ! దేవదాసు, పార్వతి నెందుకు పెళ్ళి చేసుకోలేదంటారూ?"

"అదేవిటి? పెద్దవాళ్ళు ఒప్పుకోలేదు కదా?"

"ఒప్పుకోకపోతేనేం? ఎదురు తిరగలేడా?"

" ఆ రోజుల్లో అలాగ లేదు."

"ఆ రోజుల్లో పెద్దవాళ్ళకి ఎవ్వరూ ఎదురు తిరగలేదా? అప్పటి వరకూ ప్రపంచంలో ప్రేమే లేదా?"

"అలా అని కాదుగానీ...."

"నా కనిపిస్తుందండీ .... ఏ రోజునైనా తీసుకోండి. ఎదురు తిరిగేవాళ్ళు ఆ రోజుల్లోనూ వుంటారు. ఎదురు తిరగని వాళ్ళు ఈ రోజుల్లోనూ వుంటారు."

కాదనలేకపోయాడు రాజారావు. నవ్వి ఊరుకున్నాడు.

"మాష్టారూ! ........."

"........... చెప్పు సుధా!"

"ఏమీ లేదండీ!.... మీరు అడిగారు .... నేనేమీ చెప్పలేకపోతున్నాను...."

"పర్వాలేదు, చెప్పు!"

".... క్షమించి నన్ను వొదిలెయ్యండి మాష్టారూ!"

".................."

"ఆరోజునించీ నేను చాలా ఆలోచించాను. కానీ .... ఒక్కరే అనుకుంటే కాదు గదా? ఒకరి గురించి ఒకరు అనుకోవాలి. ఇద్దరూ అనుకోవాలి. నాకా ఆలోచనే కలగడం లేదు మాష్టారూ! ...."

"ఇదా నువ్వు చెప్పాలనుకున్నది?"

"అందుకే నన్ను క్షమించమని అడిగాను ...."

"సుధా! ప్రేమమీద నమ్మకం లేదన్నావు. 'ప్రేమ వుందా లేదా' అనే ప్రశ్న ఎందుకు? ఆ సంగతి వదిలేసి నా గురించి మిగతా విషయాలే ఆలోచించరాదా?"

"అదే ఆశ్చర్యంగా వుంది. ఇద్దరూ ఒకర్ని ఒకరు కోరుకోకపోతే, జీవితం ఎందుకు అనిపిస్తోంది. ప్రేమకి ఇంత విలువ ఇస్తానని ఎప్పుడూ అనుకోలేదు."

"నా మీద నీకు సందేహంగా వున్నట్టుంది."

"కాదు మాష్టారూ! మీరు చెప్పారు. నా వేపునించి ఆలోచించుకుంటే నా మనసులోనే ఏమీ లేదు .... ఎలా చెప్పాలా అని భయపడుతూ వచ్చాను...."

"తొందరేముంది సుధా! ఇవ్వాళే తేల్చుకోవాలా?"

"వొద్దు మాష్టారూ! ఇంకా చెప్పడానికేముంది? ఇంకా కొన్నాళ్ళుపోతే మాత్రం నేనేం చెప్పగలను? అందుకే క్షమించమని అడిగాను."

"నువ్వేం తప్పుచేశావని అలా అడగడం?"

"తప్పుకాకపోయినా.... మీకు కష్టం కలిగించాను."

".... అది నా దురదృష్టం అనుకుంటా ...!"

"అయ్యో, అలా అనకండి! అదృష్ట దురదృష్టాల్ని నమ్ముతారా? నాకా నమ్మకాలు లేవు.

"నాకూ లేవనుకున్నాను...."

"నా వల్ల మీరిలా అవడమా? వొద్దు మాష్టారూ! నన్ను మీ స్టూడెంటుగా తీసుకోండి."

అసలు రాజారావు మాట్లాడాలనుకున్నది ఈ రకంగా కాదు.

సుధ మీద తనకీ అభిప్రాయం ఎప్పుడు కలిగిందో చెప్పాలనుకున్నాడు. ఇద్దరూ ఒకే జీవితంగా ఎలా గడపాలో చెప్పాలను కున్నాడు. తన నిర్ణయం తల్లికి అయిష్ట మైనా, ఆమెకి ఎలా నచ్చ చెప్పాలను కుంటు న్నాడో చెప్పాలనుకున్నాడు అన్నిటికీ సుధ సంతోషిస్తుం దనుకున్నాడు. కానీ, ఈ సుధ, తనెరిగిన స్టూడెంట్ సుధ కాదనిపించింది.

పౌర్ణమి చాలా దగ్గిర పడిందేమో, వెన్నెల చాలా కాంతిగా, చల్లగా వెలుగుతోంది. గాలి బాగా చల్లబడి చలి పుట్టిస్తోంది. సుధ పైటచెంగు భుజాలచుట్టూ కప్పుకుంది.

"వెళ్దామా?" అన్నాడు రాజారావు.

"పదండి" అని లేచింది.

ఇద్దరూ ఆకుల సందుల్లోంచి పడే వెన్నెల నీడ ల్లోంచి నడుస్తున్నారు.

రాజారావు సుధ చెయ్యి పట్టుకున్నాడు. సుధ ఆగింది.

జీవితంలో ఈ అమ్మాయిని పోగొట్టుకోకూడదు అనిపించిందా క్షణం అతనికి.

"ఏం ఆలోచిస్తున్నావు సుధా?"

"ఏం లేదండీ!"

".... నువ్వంటే నాకెంతో ఇష్టం ...."

"................................"

"ఇంకొక్కసారి ఆలోచిస్తానని మాట ఇవ్వలేవా?"

".... వొద్దు మాష్టారూ! మళ్ళీ మిమ్మల్ని కష్టపెడతానని భయంగా వుంది."

రాజారావు, సుధ చెయ్యి నెమ్మదిగా వదిలి పెట్టాడు.

సుధ, బస్సులో కూర్చున్నంతసేపూ మాష్టారి గురించే బాధగా ఆలోచించింది.

ఇంటికి వచ్చేటప్పటికి చంద్రశేఖర్ గేటు దగ్గిరే చెట్టు కింద కనపడ్డాడు.

"మా మాష్టారికి చెప్పేశాను."

వినగానే అర్థమేకాలేదు, తేరుకుని "ఏమనీ?" అన్నాడు.

" 'క్షమించండి' అన్నాను...."

"అయ్యో! చాలా బాధపడి వుంటారు."

"అలాగే అనిపించారు...."

"నాలుగు రోజులుపోతే మీకూ చాలా పశ్చత్తాపం కలుగుతుంది."

సుధ నిరుత్సాహంగా నవ్వింది "అలా జరగదు గానీ, నిజంగా నాకూ బాధగానే వుందండీ అయన్ని తల్చుకుంటోంటే...."

★ ★ ★

ఆ సాయంత్రం సుధ ఇంటికి వొచ్చేసరికి పద్మావతి చంద్రశేఖర్‌తో ఏవో పెళ్ళి సంబంధాల గురించి మాట్లాడుతోంది. కొంతసేపు వింటే తెలిసిన సంగతి — ఆ సంబంధాలు ఎవరికో కాదు, చంద్రశేఖర్‌కే.

సుధ అక్కణ్ణించి వెళ్దాం అనుకుంటూంటే "సుధా! లలిత ఫొటో వుండాలే మన దగ్గిర. ఎక్కడుంది?" అంది పద్మావతి.

"చూస్తాను" అని సుధ లోపలికి వెళ్ళి వెదికి ఒక కవరు తెచ్చి తల్లి చేతికి ఇచ్చింది.

పద్మావతి నవ్వుతూ "మీ రసలు ఫొటో చూడక్కర్లేదు. పిల్ల చాలా అందంగా వుంటుంది" అని కవరు అందించబోయింది.

చంద్రశేఖర్ తీసుకోలేదు. తనకిప్పుడు పెళ్ళి ఉద్దేశం లేదని అతను మొదటే స్పష్టంగా చెప్పాడు. అయినా పద్మావతి అంత నిరుత్సాహ పడలేదు. "టేబుల్‌మీద పెట్టు సుధా! తర్వాతెప్పుడన్నా చూస్తారులే" అంది.

లలితకి బాగా కట్నం ఇస్తారు. అల్లుడికి ఉద్యోగం కూడా ఇప్పిస్తారు. పిల్ల చాలా అందమైంది. చదువుకున్నది — ఈ విషయాలన్నీ చాలా స్పష్టంగానే చెప్పిందావిడ. చంద్రశేఖర్ ఏమీ మాట్లాడలేదు.

"నీకు వర్ణాంతరం అంటే ఏమన్నా అభ్యంతరం వుందా? మీ పెద్ద వాళ్ళేమన్నా అడ్డు పెడతారంటావా?" అందావిడ విషయం కొంచెం మార్చి. ఇది ఇంకో సంబంధం గురించి.

"నాకు అలాంటిదేం లేదులెండి. పెద్ద వాళ్ళెలాగూ అడ్డుపెడతారు. అది ఎప్పుడూ జరిగేదే" అన్నాడు.

"నువ్వు కాస్త నచ్చచెపితే వాళ్ళుకూడా ఏమి అనరు లేవోయ్. నేను మీ అమ్మకి రాస్తాలే. ఈ రోజుల్లో ఇవన్నీ ఎవరు పట్టించుకుంటున్నారు? ఏ తిండి దగ్గరో కొంచెం ఇబ్బంది వచ్చినా ఎవరో ఒకరు సర్దుకోవచ్చు. నీ కిష్టం లేకపోతే ఆ అమ్మాయే వాళ్ళ కూరలు మానేస్తుందిలే."

"ఎవరి సంగతి?" అంది సుధ ఆశ్చర్యంగా.

"శకుంతల."

"ఏం? తనే ఎందుకు మానేస్తుంది? నువ్వు చెప్పేది ఎలా వుందంటే — 'మనలో మనకి పోట్లాటలెందుకు? సామరస్యంగా పోదాం. నేను చెప్పినట్టే చేద్దాం' అన్నాట్ట ఒకాయన" అంది సుధ నవ్వులాటలో పెట్టి.

"సర్లే! నువ్వు కాసేపు వూరుకుందూ!" అని పద్మావతి మళ్ళీ చంద్రశేఖర్‌తో —"ఎమ్మే పాసయిందోయ్. ఉద్యోగంకూడా చేస్తోంది రెండేళ్ళనించీ. పిల్ల చక్కగా వుంటుంది. మంచి కుర్రాడు దొరికితే ఏ కులం అయినా చేసెయ్యా లనుకుంటున్నారు వాళ్ళ నాన్నగారు" అని వూరుకుంది 'ఇక జవాబు చెప్పు' అన్నట్టు.

"ఎమ్మే చదివి ఉద్యోగం చేస్తోన్న పిల్లకి చుట్టాలు సంబంధాలు వెతకడం .... నాన్నగారు పెళ్ళిచెయ్యటం ఏమిటండీ?" అందా మనుకున్నాడు చంద్రశేఖర్.

రెండు సంబంధాలకీ తను సుముఖంగా లేనందుకు అసలే ఆవిడ నిరుత్సాహంగా వుంది. కూతురు హాస్యానికే విసుక్కుంది.

"అసలు నాకు ఉద్యోగమే లేదుకదండీ" అనేశాడు ఏవిటో తొందరగా బైటపడాలని. ఉద్యోగం వుంటే మాత్రం వాళ్ళూ వీళ్ళూ సంబంధాలు చూసే పద్ధతిలో పెళ్ళి చేసుకుంటాడా?

"ఉద్యోగం ఇప్పిస్తారు కదటోయ్" అంది ఆవిడ ఉత్సాహంగా.

అదుగో, అదే మరి! ఒక పిచ్చివాగుడు వాగితే, ఇలాగే అవుతుంది.

కొంతసేపు ఆవిడే పిల్లల అందచందాలూ, గుణగణాలూ వర్ణించింది. "మంచి సంప్రదాయంగల కుటుంబాలు. ఎవర్ని చేసుకున్నా సుఖపడతావు" అని నొక్కి చెప్పి లేచి వెళ్ళిపోయింది. తన వెనకాలే కూతుర్ని పిలిచి — "లలిత ఫొటో అతనికి చూపించు. తప్పకుండా వొప్పుకుంటాడు" అని నెమ్మదిగా చెప్పింది.

చంద్రశేఖర్, గదిలోకి పరిగెత్తి చేతికందిన పత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు.

సుధ కవరు తీసుకెళ్ళి అతని ముందు టేబుల్ మీద పెట్టింది.

"మా అమ్మ ఈ ఫొటో మీకు తప్పకుండా చూపించమంది" అంది.

చంద్రశేఖర్ తలెత్తి ఆశ్చర్యంగా చూస్తూ "మీరు కూడా ఇలా చెయ్యటం ఏం బాగాలేదు. నేనేదో హీరో నైనట్టూ, ఆ ఆడపిల్లలు కన్నెత్తి చూడ్డానికి కూడా అర్హులు కానట్టూ ప్రవర్తించడం, నాకే సిగ్గుగా వుంది. నేనా ఫొటోలు ఎందుకు చూడాలి? నా కిష్టంలేదండీ! మీ అమ్మగారికి మీరే ఏదో చెప్పండి. లేకపోతే నేను చూడనన్నాననే చెప్పండి" అన్నాడు.

సుధ మాట్లాడలేదు.

"మీ అమ్మగారు ప్రేమ వివాహం చేసుకున్నారు కదా? నన్ను కట్నానికో, ఉద్యోగానికో ఆశపడి ఎవరో కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసుకోమంటారేం?"

"అవిణ్ణే అడక్కపోయారా? తర్వాత అడగండి. నిజంగా అడగండి" అనేసి వెళ్ళిపోయింది సుధ.

చంద్రశేఖరం ఏమీ చెప్పేట్టు కనపళ్ళేదు పద్మావతికి.

సాయంత్రం వేళకి టేబుల్ దగ్గిర వొక కొత్త మ్మాయి ప్రత్యక్షమైంది!

"శకుంతలండీ! కొంచెం పనిమీద వొచ్చింది" అని పరిచయం చేసింది పద్మావతి, ఆ అమ్మాయిని చంద్రశేఖర్‌కి.

శకుంతల మామూలుగా కన్నా ఎక్కువ ముస్తాబు చేసుకున్నట్టు కనపడింది సుధకి, జార్జెట్‌మీద జరీ పువ్వులచీర కట్టుకుంది. తల్లో పూలు బాగా పెట్టు కుంది. చేతులనిండా గాజులూ, గోరింటాకు రంగులూ, మెడలో నెక్లెస్ వుంది. ఎక్కువ సిగ్గు ప్రద ర్శించకుండా సుధ తోటీ, పద్మావతి తోటీ బాగానే మాట్లాడుతోంది. 'కంఠం శ్రావ్యంగా వుంది' అను కున్నాడు చంద్రశేఖర్. అంతకన్నా అతనేమీ ఆలోచించ లేదు.

శకుంతల మాత్రం అతన్ని తరిచి తరిచి చూసింది. అందచందా లెలావున్నా తన భర్త అయ్యే వ్యక్తికి పెద్ద ఉద్యోగం వుండాలని ఆమె కోరుకుంటూ వుంది. పెళ్ళికాగానే తన ఉద్యోగం మానేసి అతనితో వెళ్ళిపోవాలి అనుకుంటోంటే, ఈయనకి ఉద్యోగమే లేదు! మంచి బట్టలన్నా వేసుకోలేదు!

శకుంతల మొహంలో ఎక్కువ ఇష్టం కనపళ్ళేదు సుధకి — "ఈ మధ్య ఏమన్నా సినిమాలు చూశావా శకుంతలా?" అని అడిగింది సుధ.

"'అనుభవ్' చూశాను, చాలా బాగుంది. నువ్వు చూశావా?" అంది శకుంతల.

"చూశాను. నాకేం నచ్చలేదు."

"నచ్చలేదా? భలే దానివే, అంత బాగుంటే .... అందులో ఏం నచ్చలేదూ నీకు?"

"ఏమీ నచ్చలేదు. అందులో సమస్యలన్నీ అర్థం పర్థంలేని సమస్యలు. వొళ్ళు మండింది చూస్తోంటే."

"మనుషులు అలాంటి సమస్యల్లోనే కొట్టు కుంటూ వుంటారు" అంది పద్మావతి.

"కొట్టుకోనియ్యి! మనం జాలి పడక్కర్లేదు" అంది సుధ.

శకుంతల చంద్రశేఖర్ సాక్ష్యం తీసుకోవాలని — "మీరు చూశారాండీ? బాగా లేదూ?" అంది.

చంద్రశేఖర్ కొంచెం తటపటాయించి "చూశాను .... పోనివ్వండి. సరిగా గుర్తులేదు" అన్నాడు.

శకుంతల కొంచెం నవ్వి వూరుకుంది.

కాఫీ లవగానే అతను గదిలోకి వెళ్ళిపోయాడు.

శకుంతల పద్మావతి వెనకే వంటింట్లోకి వెళ్ళి — "అదేంటి పిన్నీ? అలా వున్నాడేం?" అంది.

"ఎలా వున్నాడు?" అని నవ్వింది పద్మావతి. "చాలా మంచి వాడమ్మా! చిన్నప్పట్నుంచీ మెరిట్ స్కాలర్‌షిప్స్‌తో చదివాడు" అంది.

"టెర్లిన్ బట్టలు వేసుకో డనుకుంటాను."

"కొంచెం ఇబ్బందిలో వున్నాడుగా వుద్యోగం లేక? పోనీ నువ్వే కుట్టిస్తే సరి. ఉద్యోగం వున్నదానివేగా?" అని హాస్య మాడిందావిడ.

"అబ్బే! అందుక్కాదు!" అని నసుగుతూ నిల బడింది శకుంతల.

టేబుల్ మీద గిన్నెలు పట్టుకుని సుధ లోపలి కొచ్చేప్పటికి — "అసలతను వొప్పుకుంటాడా లేదా

అని నేను సందేహిస్తోంటే నువ్వు కూడా సణుగుతున్నావా?" అని మందలిస్తోంది పద్మావతి, శకుంతలని.

"వొప్పుకోడూ? ఎందుకొప్పుకోడూ?" అంది శకుంతల ఆశ్చర్యపోతూ.

"ఉద్యోగం చేసే ఆడవాళ్ళని మొగాళ్ళు కొందరు వొప్పుకోరు. పోనీ అతనికి ఉద్యోగం వొచ్చాక నువ్వు మానెయ్యి!" అంది పద్మావతి.

"ఛీ ఛీ! అతను అలాంటివాడు కాదమ్మా!" అంది సుధ అడ్డొచ్చి.

"మరైతే ఎందుకిష్టం లేదూ?" అంది శకుంతల, చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ.

"అడగరాదూ నువ్వెళ్ళి? మధ్యవర్తులెందుకూ? స్వయంగా మాట్లాడరాదూ?" అంది సుధ.

"వొద్దొద్దు. నువ్వొస్తావని అతని కసలు ముందు చెప్పలేదు. కొంచెం మొహమాటం మనిషి. తర్వాత నేనే అడుగుతాలే. మాట్లాడే వుద్దేశం వుంటే, మళ్ళీ వద్దువుగానిలే" అని అభ్యంతరం పెట్టింది పద్మావతి.

శకుంతలకి పూర్తిగా నీరసం వొచ్చింది. ఇలాంటి సంబంధం తప్పిపోతే నష్టమేమీ లేదు. భర్త అనేవాడు భార్యకి చీరలుకొని నగలు చేయించి ముద్దు ముచ్చట్లు చూడాలిగానీ, తనే అతనికి బట్టలు కుట్టించాలిట! బాగానే వుంది — అనుకుంటూ లేచింది. తన చీరమీద సుధ ఏమీ ఆసక్తి చూపించకపోతే "ఈ చీర నీకు నచ్చలేదా? మొన్న ఫస్టునాడు కొన్నాను. తొంభై రూపాయలు" అంది.

"అంత ఖరీదా?" అని ఆశ్చర్యపడింది సుధ.

"నా దగ్గిర నూట యాభై రూపాయల జార్జెట్ ఇంకోటి వుంది. ఈ సారి కట్టుకొస్తాను. వెళ్తాను పిన్నీ" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆ రోజు చంద్రశేఖర్‌కి కూడా ఏమీ ఉత్సాహంగా లేదు. రెండో ఇంటర్వ్యూలో కూడా అతను సెలెక్ట్ కాలేదు. అతనే కాదు. అసలు ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళు ఎవరూ సెలెక్టు కాలేదు.

శకుంతల వెళ్ళిపోయిం తర్వాత సుధ ఖాళీ చేసుకుని అతని దగ్గిరికి వొచ్చింది — 'దిగులు పడకండి. ధైర్యంగా వుండండి' అని ఓదార్చాలనిపించలేదు. విచారించే విషయానికి విచారించకపోతే, సంతోషించే విషయానికి సంతోషించటం కూడా చేతకాదు.

"కాస్సేపు బయటికి వెళ్దాం రండి" అన్నాడు చంద్రశేఖర్.

"అమ్మ సినిమాకి వెళ్తోంది. సత్యవతిగారు కబురు పంపితే వొస్తానని చెప్పింది. మనం — అంటే నేనే లెండి .... కొంచెం వంట చెయ్యాలి ఈ పూట. మీరు కూడా వంటింట్లోకొచ్చి కూచుని, అదే మన పార్కు అనుకుంటే సరిపోతుంది" అని నవ్వింది సుధ.

"ఎంతమాట! అది పార్కుకన్నా గొప్పది. కడుపులు నిండిన తర్వాతే పార్కులూ, షికార్లూ, సరే! అలాగే చేద్దాం" అని ఆమోదించాడు చుట్టాలబ్బాయి.

"మీరు నిజంగా ధైర్యంగా వున్నట్టున్నారే! ఉద్యోగం రానందుకు బాగా విచారించమని ప్రోత్సహించటానికి వచ్చాను."

"వస్తే వొచ్చారు. నా ధైర్యం చూసి సలహా ఇచ్చే అవకాశం పోయిందని నిరాశపడకండి! ముందు మీరు ధైర్యంగా వుండండి."

సుధ నవ్వుతూ వెళ్ళింది తల్లి పిలిస్తే.

పద్మావతి ఏమేం కూరలు వొండాలో — ఏ కూరలో అల్లం వెయ్యాలో, ఏ కూరలో కొబ్బరి వెయ్యాలో పదిసార్లు చెప్పి, గేటు ముందుకు వొచ్చిన పక్కింటివాళ్ళ కారెక్కి వెళ్ళిపోయింది.

సుధ వీధి తలుపువేసి వొచ్చి వంటింట్లో ఒక కుర్చీ పడేసి చంద్రశేఖర్‌ని ఆహ్వానించింది.

"ఇప్పుడు కార్యక్రమం ఏమిటి?" అంటూ వొచ్చాడతను.

"మీరు ఏదన్నా చదువుతూ కూచోండి. లేకపోతే మాటలు చెప్పండి. నేను వింటూ వంట ప్రారంభిస్తాను. మధ్యలో కాసేపు ఇంటర్వెల్ ఇచ్చుకుని కాఫీలు తాగుదాం" అంటూ పైట చెంగు బొడ్లో దోపి, కత్తిపీట ముందు ఉల్లిపాయలు పోసుకుని కూర్చుంది సుధ.

చంద్రశేఖర్ గాభరాపడి — "ఆగండి. ఆగండి. అసలీ ప్రోగ్రాం ఎంతసేపు?" అని అడ్డొచ్చాడు.

"సుమారు మూడు గంటలు. పది నిమిషాలు అటో ఇటో."

"ఇటెందుకు? అటే వేద్దాం. మూడు గంటల పది నిమిషాలు! అప్పటికి మీరు వంట చేస్తారన్న మాట! వొక గంటయ్యాక అప్పటికి తయారైనవి తినేసి మళ్ళీ మొదలుపెట్టాలి. మళ్ళీ ఇంకోగంట తర్వాత కూడా అలాగే. ఇక ఈ వంట ఈ యుగాంతానికి కూడా ముగిసే దారి వుండదు. నేనిప్పుడే వాకౌట్ చేస్తున్నాను" అని కుర్చీలోంచి లేచా డతను.

అప్పటికే ఉల్లిపాయలు పొగరుపడి ఏడుపు మొహంపెట్టి — "మరేం చెయ్యమంటారు? పప్పు చారు పెట్టాలి. దోసకాయ పచ్చడి చెయ్యాలి. పొట్ల కాయ వేయించాలి. ఇంకేదో చెప్పిందండీ — ఎందు లోనో కొబ్బరి కూడా వెయ్యమందండీ!" అని జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నించింది సుధ.

"మన కడుపుల్లో వేసెయ్యొచ్చు లెండి. కొబ్బరి ముక్కలు కొరుక్కుని తినేస్తే సరిపోతుంది. అది క్లిష్ట సమస్యేం కాదు. ముందు మీరు చెప్పిన ఐటమ్స్ అన్నీ తగ్గించేసి అరగంటలో వంట అయిపోయి బయటపడే విధానం ఆలోచిద్దాం."

"అరె! అరగంటలో వంటా? వంట అరగంట లోనా?"

"లేకపోతే మూడు గంటలు చేస్తే ఐదు వేల మంది సంతర్పణకి వండొచ్చు."

"ఏవిటీ? వొక్క మనిషే!"

"ఆఁ, వొక్క మనిషే."

"తింటానికే!"

"ఆఁ, తింటానికే. మీరు లేచి కుర్చీలో కూచోండి. నేను చేసేస్తాను అర గంటలో!"

"ఏవిటీ? మీకు వంటొచ్చా?"

"మీకు మాత్రం వొచ్చా? ఒచ్చినవాళ్ళు మూడు గంటల పది నిమిషాలు చేస్తారా వంట?"

"అబ్బ! ఆ పది నిమిషాలూ మీరే కలిపారు. మీరింక మాట్లాడకండి. ఎలాగో చేసేస్తాను."

"అదేం కుదరదు. ముందు మీరు ఆ కూరగాయ లన్నీ దాచెయ్యండి! పప్పుచారు వొక్కటీ చేద్దాం సరిపోతుంది."

"అమ్మ తిడుతుందండీ!"

"తిట్లు తినేస్తే సరిపోదూ? లేకపోతే, ఆడవాళ్ళు గంటలకొద్దీ వంటిళ్ళలో మగ్గడం బానిస లక్షణం అని ఉపన్యాసం ఇచ్చెయ్యండి!"

"ఇస్తాగానీ .... చిన్న సందేహం! వంటిళ్ళలో మగ్గ కూడదు. పోనీ స్టౌని, డైనింగ్ హాల్లో పెట్టుకుని వంటచేస్తే?" అని నవ్వబోయి మళ్ళీ ఉల్లిపాయ పొగరుకి ఏడుపు మొహం పెట్టింది సుధ.

"మీరలా దుఃఖపడటం నేను చూడలేను. మీరు లేవండి, నేను కోసి ఇస్తా" అని బీరువా మీదనించి చాకు తీసుకున్నాడు చంద్రశేఖర్.

సుధ అది వూళ్ళాక్కుని — "ఇది బ్రెడ్డు కోసేది లెండి" అని దాన్ని దూరంగా పెట్టింది.

చంద్రశేఖర్ ఇంకో చాకు దొరకబుచ్చుకున్నాడు.

సుధ అదికూడా వూళ్ళాక్కుని "ఇది బ్రెడ్డుకి వెన్నరాసేది లెండి" అని అదికూడా దూరంగా పెట్టింది. ఇంకో చాకు పళ్ళు కోసేది. ఇంకోటి పెన్సిళ్ళు చెక్కేది. అది ఇక్కడెందుకుందోగానీ వుంది.

"అమ్మ ఉల్లిపాయలు ఏ చాకుతో కోసేదీ?" అని ఆలోచన్లో పడి చివరకి — "అమ్మ ఉల్లిపాయలు కత్తి పీటతోటే కోస్తుంది" అని తీర్మానించింది.

చంద్రశేఖర్‌కి కోపంవచ్చి — "అమ్మతో ఆగారేం? అమ్మమ్మ ఎలా కోసేదో గుర్తులేదూ? ఇంకా వెనక్కి వెళ్ళండి! మన పూర్వీకులు ఉల్లిపాయలు రాళ్ళతో చిత గ్గొట్టుకునే వారేమో! లేకపోతే అసలు ఉల్లిపాయలు లేకుండానే పప్పుచారు పెట్టుకునేవారేమో! ఆఁ, అదీ! ఆ పద్ధతిలో చేద్దాం — ఎంత వెనక్కి వెళ్తే అంత ప్రశస్తం! అంత సౌఖ్యం! ఇప్పు డర్థమౌతోంది నాకు వెనకవాళ్ళు ఎంత తెలిగ్గా బతికారో! అందుకే మన వాళ్ళు 'వేదాలో, వేదాలో' అని గోలపెడతారు" అని ఉల్లిపాయలన్నీ బుట్టలో పడేసి, బుట్టతీసుకుపోయి దూరంగా పడేశాడు.

"పప్పుచారులో ఒక్క ఉల్లిపాయకూడా కనపడక పోతే నాన్న గంతులేస్తాడు. నాన్నకి కోపం వొస్తే అమ్మకి భయం. పోనీ, ఒకటో రెండో పడేద్దాం."

"రెండు కాదు ఒకటే! ఆయనకి చాలు. అది నేను కోస్తాలెండి" అంటోంటేనే చంద్రశేఖర్‌కి కళ్ళల్లోంచి జలజలా నీళ్ళు చిమ్మాయి. "ఉల్లిపాయల్ని కొయ్య కుండా వొండే పద్ధతి చరిత్రలో ఎక్కడా లేదా?" అని

విసుక్కున్నాడు.

"నేను చరిత్ర స్టూడెంట్‌ని కాదు. ఫిలాసఫీ" అంది కోపంగా సుధ.

"ఐ.సీ." అని కళ్ళు గట్టిగా మూసుకుని ఉల్లిపాయని కసిగా నరకబోయి వేలు నరుక్కుని ఆర్తనాదం చేశాడు.

చివరికి రక్తపాతంతో, 'అన్నం' అనే వొక్క మెత్తటి తెల్లటి పిండి పదార్థంతో, వంట ముగిసింది. ఇద్దరూ గబగబా బయటికి పారిపోయి వొచ్చారు వంటింట్లోంచి.

"తలుపులేసేసి తాళం పెట్టేసి, తాళం గోడవతల పారెయ్యండి. తాళం వుంటే.... నాకు నమ్మకం లేదు. మీరు మళ్ళీ వంటక్రియ ప్రారంభిస్తారు" అన్నాడు చంద్రశేఖర్ భయపడుతూ.

"ఇంక చెయ్యను. ప్రామిస్" అని మాట ఇచ్చింది సుధ.

ఇద్దరూ సబ్బుల్తో ఉల్లిపాయ వాసన చేతులూ, మొహాలూ కడుక్కుని మంచినీళ్ళు తాగి, అలసట తీర్చుకుని, ఇంటిముందు చెట్టుకింద సేదదీరారు.

"వంట చెయ్యటం కష్టమే అనుకుంటాను" అని కొంచెం పశ్చాత్తాపం వెలిబుచ్చాడు చంద్రశేఖర్.

"అర గంటలో చెయ్యటం మరీ కష్టం. వొప్పేసుకోండి" అని వొత్తిడి చేసింది సుధ.

వొప్పేసుకుని — "మన అమ్మలు ఎంత త్యాగధనులండీ! వాళ్ళు కూడా వేళ్ళు కోసుకుంటారా? మా అమ్మకి ఎన్ని వేళ్ళున్నాయో లెక్క పెట్టాలి ఇంటికెళ్ళి" అని ఆతృతపడ్డాడు.

"ఎప్పుడు వెళుతున్నా రేమిటి?"

"రేపే"

"మా నాన్నేమన్నాడు?"

"ఇప్పటికి దయచెయ్య మన్నారు. మళ్ళీ ఏదన్నా వస్తే కాకితో కబురంపుతామన్నారు."

"అయితే మీకు దొంగనోట్ల వ్యాపారం తప్పేట్టు లేదు. అందుకే శకుంతల్ని పెళ్ళిచేసుకోరాదూ? పోనీ లలితని .... వాళ్ళే ఉద్యోగాలు వేయిస్తారు."

చంద్రశేఖర్ చాలా సీరియస్‌గా అయిపోయి "మీరింకెప్పుడూ హాస్యానికి కూడా అలా మాట్లాడకండి!" అన్నాడు, అవమానపడ్డట్టు.

సుధ అతన్ని ఆశ్చర్యంగా చూసింది. నవ్వింది. "మా నాన్న మీ ఉద్యోగం కోసం ప్రయత్నం చెయ్యడం లేదూ? అలాగే, లలిత నాన్నో, శకుంతల నాన్నో మీ కోసం చేస్తే తప్పేమిటి?" అంది ఏమంటాడో చూడాలన్నట్టు.

"దీనికీ దానికీ తేడా తెలీడం లేదా మీకు? అలాగైతే చెప్పినా తెలీదులెండి" అని మరింత అవమానపడ్డట్టు చూశాడు.

సుధ సిగ్గు పడింది — " ఆ మాటలన్నీ నేను నిజంగా అన్నాననుకుంటున్నారా?"

"నిజమో అబద్ధమో, అన్నారు కదా?"

"మీరేమంటారో చూద్దామనీ."

"ఏ మంటాననుకున్నారు? లలిత ఆస్తిమీదో, శకుంతల ఉద్యోగం మీదో పడి బతుకుతాలెండి — అంటాననుకున్నారా?"

"......................."

"అసలు మనిషికోసం గాక, ఆ మనిషివల్ల దొరికే లాభాలకోసం పెళ్ళి చేసుకునే అల్పుణ్ణి అనుకుంటున్నారా నన్ను? మీకుండే ప్రేమలూ, ఇష్టాలూ, ఆదర్శాలూ పేద వాళ్ళకేమీ వుండవనుకుంటున్నారా?" అని అతను చాలా కష్టపెట్టుకుని మాట్లాడుతోంటే, సుధ నవ్వుతూనే వింది. చంద్రశేఖర్ అభిప్రాయాలు అంత సంస్కారవంతంగా వున్నందుకు మనసులో చాలా ఆనందించింది.

కొంతసేపు మౌనంగా గడిచింది! గాలికి, తలల మీద పారిజాతం కొమ్మలు వూగి జలజలా పువ్వులు రాల్చి గాలినిండా పరిమళం నింపాయి.

చంద్రశేఖర్ లేచి నిలబడ్డాడు.

సుధ అప్రయత్నంగా అతని చెయ్యి పట్టుకుని "అంత కోపమే?" అని నవ్వింది.

"ఒక ఉత్తరం రాయాలి. జ్ఞాపకం వొచ్చింది."

"నేనూ రాయాలి. పది రోజుల్నించీ జ్ఞాపకం వొస్తోంది నాకు."

"అయితే మీ ఉత్తరం అర్జంటు కాదు. పది రోజులదాకా వెళ్ళని ఉత్తరం, ఇంకో రెండ్రోజులు వెళ్ళకపోతే కొంపేం మునగదు. మీరు కూర్చోండి."

"మీ అర్జంటు ఉత్తరాన్ని ఇప్పుడెవరూ విమానం మీద పట్టుకెళ్ళటంలేదు. కూర్చోండి ముందు" అని చంద్రశేఖర్ చెయ్యిపట్టుకుని లాగింది.

చంద్రశేఖర్ నవ్వి లేచిన చోటే కూర్చున్నాడు.

"నిజంగా మీ కోపంతో నన్ను హడలగొట్టారు బాబూ!"

"పేదవాళ్ళకి కోపం కూడానా? ఏనాడో సామెత కూడా చెప్పారు."

"సామెతల జోలికి పోకండిగానీ, మీ పేదతనం మీ బట్టలదీ, చెప్పులదీ అని నేను మొదట్లోనే అనుకున్నాను. నిజంగా నా మాటల్తో మీ కంత కష్టం కలిగించానా? నన్ను నమ్మండి. నే నెప్పుడూ మిమ్మల్ని అంత తక్కువ అంచనా వెయ్యలేదు. మీరే నన్ను ధనగర్వంతో మిడిసిపడే వాళ్ళ రకంలో చేర్చి చాలా అవమానించారు. నా దగ్గిర ధనరాసులేమీ లేవండీ! మా వాళ్ళ దగ్గిర కూడా లేవు. పాపం మా నాన్నకి కారే లేదు."

చంద్రశేఖర్ ఏమీ అనలేదు.

"ఇంకా కోపమేనా? రేపు మీరెలాగూ వెళ్ళిపోతున్నారు. ఈ వొక్క రోజూ ఇలా అయిపోవలసిందేనా?"

చంద్రశేఖర్ కొంచెం నవ్వి కోపం లేదని రుజువు చేశాడు.

"సరే, ఇప్పుడు చెప్పండి! మీ కెలాంటి పిల్ల కావాలి? అలాంటి పిల్ల నా కెక్కడన్నా కనపడితే మిమ్మల్ని కలుసుకోమని మీ ఎడ్రస్ ఇస్తాను."

"మీ రుణం వుంచుకోను. నేనూ మీ కోసం అదే చేస్తాను. మీకెలాంటి అబ్బాయి కావాలో చెప్పండి!"

"మీ కింకా తెలీదా. నేను పెళ్ళి చేసుకోను."

"ఏం, ఎందుకూ?"

గేటు ముందు కారు ఆగింది. పద్మావతి దిగింది.

"అమ్మ వొచ్చేసింది. ఎందులోనో అల్లం వెయ్యమందండీ" అని కంగారు పడింది సుధ.

సుధ కంగారు పోయేటట్టు ఉచితమైన సలహా ఇవ్వలేకపోయాడు చంద్రశేఖర్ ఆ కంగారులో.

పద్మావతి వంటింట్లోకి వెళ్ళి దాని తీరుతెన్నులు అంతా గ్రహించి — "అయితే నువ్వు కూరలేమీ చెయ్యలేదన్న మాట! పోనీలే" అని చాలా క్లుప్తంగా కోప్పడి విశాలమైన హృదయంతో క్షమించేసింది.

"మా అమ్మకి సినిమా ఎంత బాగా నచ్చిందో! ఆ మధుర స్మృతుల ముందు ఈ క్షుద్ర విషయాలు పట్టించుకునే స్థితిలో లేదు. బతికాం దేవుడా! అమ్మ తిట్టలేదండీ! నా సంతోషం మీ క్కూడా పంచిపెడదామని వొచ్చాను. లేవండి, పచ్చడి భోజనాలకు రండి!" అని చుట్టాన్ని పిల్చి వెళ్ళిపోయింది సుధ.

భోజనాల దగ్గిర సుధ తండ్రి బాగా విసుక్కుని ""వంట చేసి పడేసి సినిమాకి పోకూడదూ?" అన్నాడు.

పద్మావతి మాట్లాడలేదు.

"ఒక్కపూట పచ్చడితో సరిపెట్టుకోలేవా నాన్నా?" అంది సుధ.

చంద్రశేఖర్ తొందరగా భోజనం ముగించి గదిలోకి వెళ్ళిపోయాడు.

పడుకోబోయే ముందు పద్మావతి కూతుర్ని పిల్చి, రూపాయల నోట్లు అందిస్తూ "తీసికెళ్ళి మీ నాన్న మొహాన్న పారెయ్యి! ఆ పూనకం దిగుతుంది" అని ఇవ్వబోయింది.

"శర్మగార్ని అడిగావా?" అని ఆశ్చర్యంగా అడిగింది సుధ.

"నే నడగలేదు. ఆయనే ఇచ్చారు."

సుధకి అసహ్యం వేసి "నువ్వే ఇచ్చుకో! అంత సిగ్గులేని పని నా చేత కాదు" అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

★ ★ ★

**సు**ధగారికి,

రైలు కదిలి ప్లాట్‌ఫారం మీద మీరు తెల్లచీరతో దూదిపింజెలాగ దూరంలో కలిసిపోయాక నేను చాలా నిరుత్సాహంగా ఒక మూల బల్లమీద జనం రద్దీలో మీ ఆలోచనలతో కాలం గడిపేశాను.

మీరు మంచి మనసుతో నాతో చేసిన స్నేహం, మీ ఉన్నత స్వభావం, మీ మాటలూ, ఎప్పటికప్పుడు నన్ను సంభ్రమంలో ముంచుతున్నాయి.

రైలు కదిలే ముందు — "మళ్ళీ ఎప్పుడొస్తారు?" అని మీ రడిగితే నేను మాట్లాడలేకపోయాను. నేను

జవాబు చెప్పకపోయినా, మీరు నవ్వి వూరుకున్నారు.

ఈ ఉత్తరం చదివి నేను చాలా సాహసం చేశాననుకుంటారేమో!

మీకు ప్రేమలో నమ్మకం లేదని అనేకసార్లు అనడం విని చాలా విచారించాను. ఆ నమ్మకం కలిగించే వ్యక్తి ఎప్పుడైనా జీవితంలో తారసపడవొచ్చునని కూడా మీకు నమ్మకం లేనట్టుంది.

మీ కీ లోకంలో ఎక్కడైనా 'ప్రేమ' దొరకవచ్చును గానీ మీరనే సంస్కారం దొరకదు. ఎందుకంటే, అది ఈ సంఘానికే లేదు. ఒక విధంగా ప్రపంచానికే లేదు.

పక్షులకూ, జంతువులకూ, కష్టాలుంటే అవి వొకరు విధించినవి కావు. ఒకరు తీర్చగలిగేవీ కావు. కానీ, మనుషుల కష్టాలు, మనుషులు కలిగించుకునేవే. ప్రపంచమంతా కొందరిని దరిద్రంలో మగ్గబెట్టే విధానాలు, స్వలాభాల కోసం చేసే యుద్ధాలు, మూఢ నమ్మకాలతో తెచ్చుకునే జబ్బులు, కాళ్ళకి బంధాలు వేసే నీతులు, మతాలూ దేవుళ్ళు, అజ్ఞానాలూ అహంకారాలు — వొకటేమిటి, మానవ సమస్యలన్నిటినీ చాలా నేర్పుగా చాకచక్యంగా తెలివిగా ఆలోచించి మానవులు తయారు చేసుకుంటున్నవే. వాటిని వొదుల్చుకునే మార్గాలు వున్నాయేమో వెదకరు.

లక్ష్మణరావుగారి 'అతడు — ఆమె' చదివారా? మిమ్మల్ని అడగడం మర్చిపోయాను. మన విమర్శ కాగ్రేసరులు, తమ ఆస్థాన రచయితల భజన తప్ప — ఎక్కడ ఏ మెరుపు, ఎక్కడ ఏ కాంతి కనపడతాయో చూడలేరు. ఈ పుస్తకానికి ఎవ్వరూ తమ వ్యాస పరంపరలో చోటివ్వకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. నేనుకూడా, ఒక పుస్తకాల పురుగు మిత్రుడు పోరటంవల్లే చదివాను. అందులో ఒక చిన్న విషయం మీకు చెప్పాలనిపిస్తోంది.

ఇది మీకు తెలిసిందేనేమో అయినా ఇప్పుడు మళ్ళీ చదవండి.

కన్యాశుల్కం నాటకాన్ని ఉదాహరణగా తీసుకుని రచయిత మానవ సమాజాన్నీ, దాని చుట్టూ ముసిరే దుష్టశక్తుల్నీ మనకు అర్థమయ్యే విధానంలో చెప్పాడు.

బుచ్చెమ్మ ఎవరో కాదు. మానవ సమాజం! అది ఒక దేశానిదే కాదు. ప్రపంచ మానవ సమాజం. ఈ సమాజం, బుచ్చెమ్మలాగే ఉత్త అమాయకత్వంతో, బేలతనంతో, శారీరకంగా మాత్రం ఒక దశకి ఎదిగింది. బుచ్చెమ్మకి తనని గురించి ఆలోచన లేదు. విద్య లేదు. నూతన చైతన్యం లేదు. ఆమె పూర్తిగా తండ్రి అధికారంలో బానిస. అగ్ని హోత్రావధాన్లు, మానవ సమాజాన్ని పీడించే మతోన్మాది. పూర్తిగా అభివృద్ధి నిరోధకుడు. ఈ తండ్రికి, బుచ్చెమ్మ సుఖసంతోషాలు అక్కరలేదు. బుచ్చెమ్మని అమ్మినప్పుడు వొచ్చే డబ్బు, జీవితాంతం బుచ్చెమ్మ చేసే చాకిరీ కావాలి. ఆమె జీవితం ఆ విధంగానే అంతమైపోవాలని ఆజ్ఞాపిస్తాడు.

బుచ్చెమ్మ వ్యతిరేకించదు. పెద్దల్నే నమ్ముతుంది. తన దురదృష్టాన్నే, తన కర్మనే నిందించుకుంటూ, వినయంతో తల్లిదండ్రులకు అణుకువగా లొంగి వుంటుంది.

అంత నిస్సహాయ స్థితిలో వున్న ఆమె జీవితంలోకి గిరీశం ప్రవేశిస్తాడు. ఎవరతను? ఎటువంటివాడు? ఏ దృష్టితో ప్రవేశించాడు? — బుచ్చెమ్మని చూసి ఆమె సౌందర్యాన్నీ యవ్వనాన్నీ దోచుకోవాలని వలలు పన్నిన దోపిడీదారుడు గిరీశం. దగాతో, వంచనతో రోజులు గడుపుకోవటమే అతని లక్ష్యం. బుచ్చెమ్మ మీద అతనికి ప్రేమ లేదు. ఆమె గడిపే జీవితంమీద నిజమైన కరుణ లేదు. ఆమె శ్రేయస్సూ, అభివృద్ధీ అతనికి అక్కరలేదు. ఆమెని సుఖ పెట్టాలనీ, ఆనంద పెట్టాలనీ అతని ఆలోచన కాదు. ఆమె శరీరాన్ని దోచుకోవాలి. ఆమె గతికి ఆమెని వొదిలెయ్యాలి.

దోపిడీదారుల చేతుల్లో మానవ సమాజానికి పట్టే గతి కూడా అదే. స్వార్థపరులకు తమ క్షేమమేగానీ, సమాజ క్షేమం అక్కరలేదు. మానవ సమస్యల్ని పరిష్కరించాలని దోపిడీదారులు ఆలోచించరు. అసలు, సమస్యల్ని సృష్టించేదే వాళ్ళు. గిరీశం బుచ్చెమ్మని భవిష్యత్ కలల్లో తేల్చినట్టు, దోపిడీదారులు సమాజాన్ని ఫలించని ప్రణాళికల మత్తులో, కట్టబోయే ఆనకట్టలూ — పెట్టబోయే కర్మాగారాలూ — కలగబోయే సౌభాగ్యాలూ కళ్ళముందు మెరిపించి, భవిష్యత్తుమీద ఆశల్లో నమ్మించి వుంచుతారు. ఈ నమ్మకాలనించి బయటపడే వివేకం, శక్తీ సమాజం నేర్చుకోవాలి.

బుచ్చెమ్మ జీవితాన్ని ఇంకో మలుపు తిప్పిన వ్యక్తి

— సౌజన్యారావు. ఆమెని — విడో హోములోనే వుంచి, ఏ మెట్రిక్యులేషన్ వరకో చదివించి, ఆమెకి కొంచెం ఆస్తి వుంది కాబట్టి దాన్ని ఇప్పిస్తే, ఆమె జీవితం వొక వొడ్డుకి చేరుతుంది అనుకుంటా డాయన.

భక్తులు గుళ్ళోకి వెళ్ళినప్పుడు పూజారి చిన్న గరిటెతో చెంబులో నీళ్ళు వాళ్ళ అరిచేతి గుంటల్లో పోసి తాగమంటాడు, చూశారా? సరిగ్గా అలాంటిదే ఈ సంఘ సంస్కారం. ఆ నాలుగు నీటిబొట్లుతో దాహం తీరడం ఎంత నిజమో, ఈ సంస్కరణ వాదంతో మానవుల కష్టాలు తీరడం అంత నిజం!

సౌజన్యారావుకూడా సంఘపు విలువల్నే నమ్ము తాడు. వాటిని ప్రశ్నించడు. అందులో నిజానిజాలు గుర్తించడు. అగ్నిహోత్రావధాన్లకి వితంతు వివాహం వింతగా కనపడితే, సౌజన్యారావుకి వేశ్యా వివాహం వింతగా కనపడుతుంది. అంతే తేడా! సంస్కర్త లెప్పుడూ సమాజంకన్నా ఒక్క అంగుళం మాత్రమే ముందు వుంటారు. తమకన్నా ముందుపోయే వారిని భ్రష్టులనీ, తమకన్నా వెనకపడ్డ వారిని చాదస్తులనీ, తమతో సమానంగా నడవటమే జ్ఞానమనీ, ఘోషి స్తారు. మధురవాణి తన సహజమైన లోకజ్ఞానంతో అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పలేక, వాటి మూల కారణాలు ఆలోచించక గీతాబోధనతో, పలాయన వాదం అనుసరిస్తాడు. గీతా ప్రదానాలూ — రక్షా బంధనాలూ — శ్రీకృష్ణ ప్రేమలూ సమాజాన్ని రక్షించ వని సంస్కర్త లెరగరు. ఈ ఈగ సంస్కర్తల్ని దున్నపోతు సంఘం ఎప్పటి కప్పుడు తోకతో ఈడ్చికొట్టి తన మానాన తను బురదలో పడుకుని ఆనందిస్తూ వుంటుంది. మతోన్మాదులైనా, దోపిడీదారులైనా, మిత వాద సంస్కర్తలైనా, సమాజానికేమీ ఉపకరించని తిరోగమన శక్తులే. బుచ్చెమ్మ, మెట్రిక్యులేషన్ చదువు తోటీ, తలదాచుకునే పెళ్ళితోటీ, లేసు అల్లికలతోటీ సంతృప్తి పడ్డదంటే, ఇక ఆమెని ఏ శక్తీ రక్షించలేదు. ఆమె ఒక వ్యక్తిత్వం సంపాదించుకుని స్వేచ్ఛగా సుఖంగా సంస్కారవంతంగా జీవించే దశకి చేరాలి.

బుచ్చెమ్మ స్థానంలో సమాజాన్నిపెట్టి ఆలోచిద్దాం.

లక్ష సందేహాలతో, భయాలతో, గత జీవిత ప్రభావాలతో ఇప్పుడే విడో హోములో చేరిన బుచ్చెమ్మ స్థితిలో వుంది మన సమాజం. అలాంటి సమాజంలో పుట్టి పెరుగుతోన్న మనుషులం మనం. మనకు అర్థమైన సంస్కారాలూ ప్రేమలూ చాలా అల్పమైనవే. కాకపోతే, మనం, ఆదర్శాల కలలు కంటున్నాం! ఉన్న తోన్నత జీవితాన్ని ఊహిస్తున్నాం!

కానీ, ఈ సమాజ ప్రభావాల్ని ఎంత వొదులుకో గలమో, మనల్ని మనం ఎంత సంస్కరించుకోగలమో, మన ఆదర్శాన్ని ఎంత అందుకోగలమో, మన కలల్ని ఎంత నిజం చేసుకోగలమో — అదంతా భవిష్యత్ లోనే తెలుతుంది!

నేను మీకేదో బోధిస్తున్నాననుకుంటారేమోనని ఇప్పుడు భయం వేస్తోంది. రాసిందంతా చింపేద్దామా అనుకున్నాను, ఇక్కడ కాస్సేపు ఆగి. మీరు నన్ను అంత అపార్థం చేసుకోరని మళ్ళీ ధైర్యం వచ్చింది. నా ఆలోచనలు మీకు చెప్పానంతే. నిజంగానే నన్ను అపార్థం చేసుకోరు కదా?

నేను ఉద్యోగంకోసం మీ ఊరు వచ్చానన్నది నిజం కాదనిపిస్తోంది ఇప్పుడు. మీ మనసులో కొంచెం చోటు సంపాదించి, మీ ఆలోచనలు కొన్నయినా నావేపు తిప్పుకుని, మీరుచేసే ప్రేమ పరీక్ష ఇంట ర్వ్యూకే వచ్చా ననిపిస్తోంది.

మీరు చెప్పిన కథలో ఆ దివ్య ప్రేమ పుష్పం అందుకునే మార్గాలేమిటా అని చాలా ఆలోచిస్తు న్నాను.

మీకు తెలిసిన చంద్రశేఖర్‌ని గాక, మీకు తెలి యని, మీ ప్రేమ సౌధం ముందు ఆశతో నిలబడ్డ చంద్రశేఖర్‌ని, గుర్తించారా?

'మూసివున్న తలుపుల ముందు భిక్ష అడగడం నాకు చాతకాదు' అన్నాడొక కవి. పిచ్చివాడు బిచ్చగాడు వస్తాడని తలుపులు బార్లా తీసి ఉంచుతారా? అతని దీనాలాపాలు విని దయదలచి తలుపులు తియ్యొ వచ్చునే! నా ఆర్తనాదాలు మీకు వినబడుతున్నాయా? — 'ఎవరు వారు?' అని మీరు లోపల్నించి అడగండి! — నే నిలా చెపుతాను:

చంద్రశేఖర్‌ని!<br>
మీ ప్రేమ భిక్షకోసం నిలబడ్డాను.<br>
కాదంటే, భిక్షలేదంటే, మిమ్మల్ని విసిగించను.<br>
ఈ సౌధం ముందునుంచి వెళ్ళిపోతాను.

ఆ ఉత్తరం సుధ చదువుకున్ననాడే ఈ ఉత్తరం చంద్రశేఖర్ చదువుకున్నాడు!

చంద్ర శేఖర్!

మీరు ఎక్కిన రైలు కదిలి ప్లాట్‌ఫారం వదిలి వెళ్ళిపోతోన్న క్షణాల్లో నాకేమనిపించిందో తెలుసా? మీరు దిగే రైలు వచ్చి ఆగి మీ కోసం నేను ఆతృతగా వెదుకుతోంటే .... మీరు నవ్వుతూ ఎదురుపడితే .... అనిపించింది! మీరు వొచ్చెయ్యండి! ఒక రోజు ముందునించే స్టేషన్‌లో వుంటాను.

మీరు వెళ్ళిపోయారు! ఈ రెండు రోజులూ నేను ఇంట్లోవున్నా. కాలేజీలో వున్నా, ఎక్కడ ఎవరితో మాట్లాడుతోన్నా, ఆలోచనలన్నీ మీ మీదే. మీరు వెళ్ళిపోతే నాకింత దిగులుగా వుండడం నాకే ఆశ్చర్యంగా వుంది! 'మీతో మాటాడాలి, అర్జంటుగా ర'మ్మని మీకు టెలిగ్రాం ఇవ్వాలనిపిస్తోంది నిమిష నిమిషం!

ఎప్పుడైనా హఠాత్తుగా గదిలోకి వెళ్తే టేబుల్ దగ్గర మీరు చదువుకుంటూ కనపడతారేమోనని అప్పు డప్పుడూ వెళ్ళి చూస్తున్నాను. తపస్సుచేసి దేవుళ్ళని చూడ్డం నిజమైతే, నేను కూడా మిమ్మల్ని చూడగలను. నేను చేసేదీ తపస్సే!

మీరు వెళ్ళింది మొదలూ నా ఆత్మలోంచి వార్తలు .... సందేశాలు .... ఆజ్ఞలు బయల్దేరుతున్నాయి — మీకు ఉత్తరం రాయమని!

మీరు మా ఇంటికి రావడం — నా భవిష్యత్తు నంతా మార్చిన సంఘటన అనిపిస్తోంది. నేనేం పుణ్యం చేసుకుంటే మీరు మా ఇంటికి వొచ్చే అదృష్టం కలిగిందో అనిపిస్తోంది. నాకు 'అదృష్టాల' మీద నమ్మకం లేదని చెప్పాను రాజారావు గారితో. కానీ, ఇప్పుడు అదృష్టాన్ని నమ్ముతున్నాను. మీరే రాకపోతే నేను రాజారావు గారితోనో, రంగారావు గారితోనో మాట్లాడి .... వాదించి, అసంతృప్తిపడి నిరాశతో రోజులు గడుపుతూ ఉండేదాన్ని.

ఏ దాంపత్యంలోనూ కాంతి కనబడదు. వొకర్ని చూడ్డమే వొకరికి ఆనందంగా తేజస్సుతో వెలిగే మొహాలు కనపడవు. అలాంటి గతే నాకూ పడు తుందనే దిగులే ఇన్నాళ్ళూ.

మీతో ఆ నాలుగు రోజులూ ఎంతో చక్కగా గడి చాయి. భాష తెలియని ఏ ప్రాచీన శిలాశాసనంలోనో ఒక్క 'కొమ్ము,' ఒక్క 'తలకట్టు', ఒక్క 'అక్షరం' అర్థమైనప్పుడు, మిగిలినదంతా చదివి మానవుల పుట్టుపూర్వోత్తరాలు గ్రహించాలని శాస్త్రవేత్తలకు కలిగే ఆరాటం కలుగుతోంది.

కారడవుల్లో దారి తప్పిన బాటసారికి సుదూరంలో దీపాలతో వెలిగే ఒకే ఒక భవనం కనపడి, దాని ద్వారాలు వోరగా తెరిచివుంటే, ఎవరి అనుమతీ లేకుండా లోపలికి ప్రవేశించాలనీ, అందులో ఆశ్రయం పొందాలనీ కలిగే అత్యాశ కలుగుతోంది.

ప్రేమ అనే దివ్య ఆకాశ సౌధపు లోపలి సుందర మైన గదుల్లో ఏం చిత్రాలున్నాయో .... ఏం అద్భు తాలున్నాయో .... ఎంతటి మహత్యాలున్నాయో తెలుసుకోవాలనే సంభ్రమం కలుగుతోంది.

పువ్వులు పూసే తోటల్లో, సెలయేళ్ళు ప్రవహించే కొండల్లో, నక్షత్రాలు మెరిసే ఆకాశంలో .... మనం ఇద్దరమూ జీవించడం ఊహిస్తున్నాను. ఏ స్త్రీ — పురుషులైనా ఇలాంటి కలలే కంటారేమో! ఇవి ఎంత సహజమో, అంత క్షణికమేమో — అని మనసు నిండా భయం కూడా కలుగుతోంది.

జీవితంలో ఎవరి ఊహలు వారివేనా? ఎవరి శ్వాస వారి ప్రాణాలు నిలుపుతోన్నట్టు ఎవరి కలలు వార్ని నడుపుతాయా? నే నిలా మీకు ఉత్తరం రాస్తోంటే, నాకు చాలా ఆనందంగా వుంది. ఈ ఆనంద తరంగాలు ఈ ఉత్తరం చదివినప్పుడు మీ మనస్సుని కూడా తాకుతాయని ఊహిస్తున్నాను.

నా అనుమతి లేకుండా రాజారావుగారు తొందర పడి నా చెయ్యి పట్టుకుంటే నేను నిర్దయగానే వదిలించుకున్నాను. కానీ, నేను కూడా మీ అనుమతి లేకుండానే మీ చెయ్యి పట్టుకున్నాను.

చీకటి ఆకాశంలో తళుక్కున ఒక మెరుపు మెరిసినట్టు మీరు వొచ్చి వెళ్ళిపోయారు. నా ఊహల్నీ, కలల్నీ కాయితాల మీదికి తర్జుమా చెయ్యడం కొత్తగా నేర్చుకుంటున్నాను. ఈ పిచ్చి ఉత్తరం చూసి —"సుధ ఇంతేనా?" అనుకోకండి. ఈ అక్షరాలలో నన్ను నేను

వ్యక్తం చేసుకోగలిగే చాతుర్యం లేదు నాకు. ఈ కలల్లో సుధని — ఈ ఆశల్లో సుధని — సుధలో సుధని అర్థం చేసుకోండి!

నా ఆలోచనలన్నీ మీ చుట్టూనే తిరుగుతామంటు న్నాయి. కానీ, ప్రేమ చాలదనీ, బియ్యం — చింత పండూ వంటి క్షుద్ర పదార్థాలు కూడా కావాలనే నగ్నసత్యాలు గుర్తొస్తున్నాయి. ఈ సంవత్సరంతో నా ఎమ్మే అయిపోతే, నాకైనా ఉద్యోగం దొరికితే — అనే బాధాకర విషయాల మీద కూడా కొన్ని ఆలోచనలు ఖర్చు పెట్టవలసివస్తోంది.

రోజూ పోస్టులో వెళ్ళే లక్షలాది సామాన్య ఉత్తరా లలో, అందకపోయినా ఫరవాలేని చెత్త ఉత్తరాలలో ఈ ఉత్తరం కలిసిపోయి అదృశ్యం కాకుండా, పోస్టు బంట్రోతులు స్వయంగా మిమ్మల్ని కలిసి చాలా భద్రంగా మీకే వినతి పత్రం అందించే మార్గాల్లో దీన్ని పంపుతాను.

ఇలాంటి ఉత్తరాలు నేను మీకు నా జీవిత పర్యంతమూ రాయగలిగితే! ప్రతీసారీ వినతి పత్రాలే కాదనుకోండీ!

నా ప్రేమ ఎన్నటికీ ఆరనిదీ ... వాడనిదీ... మాయనిదీ ... చలించనిదీ అయితే!

మీ స్నేహం కోసం
మీ ప్రేమ కోసం
ఎదురుచూసే
'సుధ'ని!
మీ సుధ నేనా?

[1972; డిసెంబరు నించీ 1973 జనవరి వరకూ 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో] ★

**ఈ కథ గురించి:**

ఈ కథలో, గతంలో రాసిన వాక్యాల్లో నించి అక్కడక్కడా కొన్ని వాక్యాలు తగ్గించాను. కొన్నిచోట్ల 'అనవసరం' అనిపించీ, కొన్నిచోట్ల 'ఈ భావాలు సరిగా లేవు' అనిపించీ.

★ "మనుషుల సంస్కారంలో తప్ప నాకు ప్రేమలో నమ్మకం లేదు" అంటుంది సుధ, రాజారావుతో. కానీ, ఆమెకి రెంటిలోనూ నమ్మకం వుంది.

ఈ కథకి గతంలో 'కొత్త ముందు మాట' రాసినప్పుడు, ఇదే విషయం మీద కొంత చెప్పడానికి ప్రయత్నించాను. 'ప్రేమా సంస్కారమూ వేరు వేరా? వాటిని విడదియ్యడం ఎందుకు? రెండూ ఒకటే' అనే అర్థంతో రాశాను. కానీ, దీన్ని ఇంకా సరిగా అర్థం చేసుకుంటే, రెండూ ఒకటి కాదు.

సంస్కారం — అంటే, సంఘంలో అమలులో వున్న భావాల కన్నా అభివృద్ధికరమైన భావాలు వుండడం. ఒక ఎక్కువ కులం యువకుడికి, కులం పట్టింపులు లేవనుకుందాం. అతనికి ఒక యువతి మీద ప్రేమ కలిగింది. కానీ, ఆమె తక్కువ కులం వ్యక్తి, అయినా, ఆ యువకుడు సంస్కార భావాలు కలవాడు కాబట్టి, ఆ ప్రేమకి ఆటంకం వుండదు. అయితే, అతనికి కులం పట్టింపులు లేవు కాబట్టి, అతనికి తక్కువ కులం వ్యక్తిమీద తప్పకుండా ప్రేమ కలుగుతుందని చెప్పడానికి వీలులేదు. రెండూ వేరు వేరు విషయాలే. దీన్ని కొన్ని ఉదాహరణలతో చూస్తేనే సరిగా అర్థం చేసుకోగలం.

**ఈ కథలో ఇంకో సంగతి:** ఒక వ్యక్తికి ఒకే సమయంలో ఒకటి కన్నా ఎక్కువ ప్రేమ సంబంధాలు వుండడం గురించి సుధ, రాజారావుతో కొంచెం ఎక్కువగానే చర్చిస్తుంది. ఆ చర్చ అంతా ఆమెకే గందరగోళంగా నడుస్తుంది. ఇప్పుడు, ఈ కథలో నించి ఆ భాగం అంతా తీసేశాను. ఎందుకంటే, అది స్పష్టంగా లేక, అపార్థాలకు దారి తీసేదిగా వుంది. ఇదే విషయం మీద నేను "అసమానత్వంలో నించి అసమానత్వంలోకే!" అనే పుస్తకంలో చాలా ఉదాహరణలతో రాశాను. ఈ కారణాల వల్ల ఈ భాగాన్ని ఈ కథలోంచి పూర్తిగా తీసేశాను.

★ఈ కథలోనించి కొన్ని వాక్యాలు తీసేశానని చెప్పాను కదా? అలాంటి ఒక వాక్యం ఇక్కడ చూపిస్తాను. చంద్రశేఖర్, సుధకి రాసిన ఉత్తరంలో ఒక చోట ఇలా అంటాడు — "నా జీవితమార్గం నాకెప్పుడూ

స్పష్టంగా లేదు. బ్రతుకుదెరువుకోసం ఏ తప్పుడుదారులు పడతానో, స్వభావం ఎదురు తిరిగి కక్షతో ఏ ఉద్యమంలో ఉరుకుతానో తెలీదు" — ఈ వాక్యం ఇప్పుడు తీవేశాను. ఎందుకంటే: 'నా జీవితమార్గం నాకెప్పుడూ స్పష్టంగా లేదు' అనీ, 'తప్పుడుదారులు పడతానేమో' అనీ చెప్పే మనిషిని, సుధ ఎందుకు గౌరవిస్తుంది? 'స్వభావం ఎదురు తిరిగి కక్షతో ఏ ఉద్యమంలో ఉరుకుతానో' అనే మాటల్లో కావలసినంత తప్పు వుంది. ఉద్యోగాలు చెయ్యడానికి (శ్రమలు చెయ్యడానికి) సిద్ధంగా వున్న మనుషులకు బతుకు దెరువులు దొరకనప్పుడు, అలాంటి సమాజం మీదా, అలాంటి పరిపాలన మీదా, తప్పకుండా కక్ష కలగాలి. ఆ పరిపాలన మీద ఏదో ఒక రూపంలో పోరాటం చేస్తే అది ఉద్యమమే. దోపిడీవర్గం ఉత్పన్నం చేసే సమస్యల మీద పోరాటాలకు దిగే స్వభావం, శ్రామికుల ఆత్మరక్షణకు ఉపయోగపడే స్వభావమే. అలాంటి స్వభావం ఏర్పడితే, మంచి స్వభావం పాడైందనీ, అది చెడుగా ఎదురు తిరిగిందనీ, అర్థం కాదు. కానీ, ఈ మాటలు చెప్పిన చంద్రశేఖర్‌కి, అసలు ఉద్యమం అంటే ఏమిటో తెలీదు. 'ఉద్యమాల్లోకి ఉరకడం తప్పు 'అనుకోవడం వల్లనే, తన ఉత్తరంలో, ఆ మాటలు అలా రాశాడు. కానీ, ఆ పాత్రకి ఆ మాటలు తగవు. ముఖ్యంగా, సుధ, అలాంటి మాటల్ని గౌరవించదు. కాబట్టి, అక్కడ ఆ మాటలు ఉండకూడదు.

★ ఒక విషయం రాసేటప్పుడు, ఎంతో జాగ్రత్తగా, తార్కికంగా రాయాలనే ప్రయత్నిస్తాను. కానీ, కొన్నిచోట్ల ఏ జాగ్రత్తలూ పనిచెయ్యవు. చాలా చిన్న విషయాల్లో కూడా పెద్ద తప్పులు జరుగుతాయి.

ఈ విషయం చూడండి! సుధ, చంద్రశేఖర్‌కి రాసిన ఉత్తరంలో ఒక చోట ఇలా రాస్తుంది — "రోజూ పోస్టులో వెళ్ళే లక్షలాది సామాన్య ఉత్తరాలలో, అందకపోయినా ఫరవాలేని చెత్త ఉత్తరాలలో, ఈ ఉత్తరం కలిసిపోయి అదృశ్యం కాకుండా పోస్టు బంట్రోతులు స్వయంగా మిమ్మల్ని కలిసి చాలా భద్రంగా మీకీ ఉత్తరం అందించే మార్గంలో ..." ఇలా!

తను రాసిన ఉత్తరం జాగ్రత్తగా అందడం సుధకి ఎంత ముఖ్యమో, ఇతరులు రాసిన ఉత్తరాలన్నీ జాగ్రత్తగా అందడం వాళ్ళకీ అంత ముఖ్యమే కదా? అది ఒక కార్డే కావచ్చు. 'అది అందకపోయినా ఫర్వాలేదు' అని ఇతరులు నిర్ణయించవచ్చునా? ఆ ఇతర లక్ష ఉత్తరాలూ అందకపోయినా సుధకేం ఫర్వా వుంటుంది? అవి రాసిన వాళ్ళకీ, వాటిని అందుకోవలసిన వాళ్ళకీ ఫర్వా వుంటుంది. సుధ ప్రేమలేఖ చంద్రశేఖర్‌కి ఎంత ఆనందం కలిగిస్తుందో, పుల్లయ్య రాసిన ఒక కార్డు ముక్క ఎల్లయ్యకి అంతకన్నా ఆనందం కలిగించవచ్చు. రిజిస్టర్ చేసే ఉత్తరాలకే గానీ రిజిస్టర్ చెయ్యని ఉత్తరాలకు విలువ వుండదా? వాటిని అందుకున్న వాళ్ళు ఆనందించరా? అవి అందకపోవడం వాళ్ళకి నష్టం కాదా? కాబట్టి, ఆ ఇతర ఉత్తరాల గురించి సుధ అలా మాట్లాడకూడదు. ఆ పాత్ర ప్రతీచోటా తార్కికంగా ఆలోచిస్తుంది కాబట్టి ఇక్కడ కూడా అలాగే ఉండాలి. తప్పుగా ఉండకూడదు. కానీ, ఆ వాక్యాల్ని కథలో నించి తీసెయ్యలేదు. అలాంటి పొరపాటు అభిప్రాయాలు కనపడితే, పాఠకులు, వాటిని గుర్తించి విమర్శించడం నేర్చుకోవాలి.

రాసేటప్పుడు ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలంటే, 'మార్క్సిజం' తెలియాలా? అక్కరలేదు. సాధారణమైన తర్కం చాలు. కానీ, చాలాసార్లు అదికూడా వుండదు.

ఇలాంటి పొరపాట్లు ఎందుకు జరుగుతాయంటే, ఎవరి అవసరం గురించే వాళ్ళకి ఆరాటం. ఇతరుల అవసరాల గురించి లక్ష్యం వుండదు. ప్రతీ మనిషికీ అలాంటి స్వభావం చిన్నతనం నించీ జీర్ణించుకుపోయి వుంటుంది. వాళ్ళు రచయితలు అయినా, కవులు అయినా, మహా కవులు అయినా!

చేసిన తప్పుల్ని గ్రహించగలిగితే, దిద్దుకోగలిగితే, ఆ స్వభావం అభివృద్ధి అవుతుంది.

కథలో ఒకచోట ఒక తప్పువుంటే పాఠకులు దాన్ని గ్రహించలేకపోతే, అలాంటి పాఠకులు, కథలో వున్న మంచి అంశాల్ని కూడా గ్రహించలేరు కదా? పాఠకులు, తప్పొప్పులు గ్రహించడమే రచయితకి కావాలి.

7-6-2004